


# విజయభాను





విశాఖపట్నం, మంగళవారం 30-04-2019 | VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION | సంపుటి : 42 సంచిక : 199 పేజీలు : 8 వెల : 1 రూపాయి


### ప్రశాంతంగా ముగిసిన

## నాలుగో విడత పోలింగ్

### 9 రాష్ట్రాలు.. 72 లోక్‌సభ నియోజకవర్గాలు అభ్యర్థుల సంఖ్య 963

### బెంగాల్‌లో ఘర్షణలు..

### ఓటు హక్కును వినియోగించుకున్న రాజకీయ, సినీ, క్రీడా, వ్యాపార ప్రముఖులు

### ఈవీఎంలలో భవితవ్యం నిక్షిప్తం



దిల్లీ: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా నాలుగో విడత పోలింగ్ సమయం పూర్తయ్యింది. ఇక పోలింగ్ కేంద్రాల వద్ద క్యూలైన్‌లో వేచి ఉన్నవారికి మాత్రమే ఓటు వేసేందుకు వీలుంటుంది. మొత్తం 9 రాష్ట్రాల పరిధిలోని 72 లోక్‌సభ నియోజకవర్గాలకు సోమవారం ఎన్నికలు జరిగాయి. కొన్ని చోట్ల ఉద్రిక్త పరిస్థితులు మినహా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఈ విడతలో 963 మంది అభ్యర్థుల భవితవ్యాన్ని ఓటర్లు ఈవీఎంలలో నిక్షిప్తం చేశారు.

ఈ విడత ఎన్నికల్లో పలువురు ప్రముఖ అభ్యర్థులు బరిలో ఉన్నారు. ప్రముఖ బాలీవుడ్ నటి ఊర్మిళా మతోండ్కర్, సంజయ్‌దత్ సోదరి ప్రియాదత్, పూనమ్ మహాజన్, మిలింద్ దేవ్‌రా, మూన్‌మూన్ సేన్, కేంద్రమంత్రులు గిరిరాజ్ సింగ్,

తరువాయి 7లో..

# కమలం వికసిస్తుంది

- దీదీ అణచివేత పరిపాలనకు చరమగీతం
- 40 మంది ఎమ్మెల్యేలు నాతో టచ్‌లో ఉన్నారు
- పశ్చిమ బెంగాల్ సభలో ప్రధాని



కోల్‌కతా: తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి చెందిన 40 మంది శాసనసభ్యులు భాజపాతో టచ్‌లో ఉన్నారని ప్రధాని నరేంద్ర మోదీ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఫలితాలు వెల్లడికాగానే వారు తమవైపు వచ్చేస్తారన్నారు. పశ్చిమ బెంగాల్‌లోని సీరామ్‌పుర్‌లో సోమవారం ప్రధాని ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు.

మోదీ మాట్లాడుతూ.. దీదీ, మే 23న ఎన్నికల ఫలితాలు వెల్లడవుతాయి. అన్నిచోట్లా కమలం వికసిస్తుంది. మీ ఎమ్మెల్యేలు మిమ్మల్ని విడిచి వెళ్లిపోతారు. ఇప్పటికే మీ పార్టీకి చెందిన 40 మంది ఎమ్మెల్యేలు నాతో టచ్‌లో ఉన్నారు పేర్కొన్నారు. రానున్న రోజుల్లో మీకు ప్రభుత్వాన్ని నడిపించడం కష్టంగా మారనుందని హెచ్చరించారు. గత మూడు సంవత్సరాల కాలంలో ప్రజలను దారుణంగా

తరువాయి 2లో..



### 'ఇంటర్'కు న్యాయం జరిగేవరకూ

## దీక్ష కొనసాగిస్తా

### నిమ్స్‌లోనే దీక్ష కొనసాగిస్తున్న లక్ష్మణ్

హైదరాబాద్: ఇంటర్ ఫలితాల్లో గందరగోళం, రాష్ట్రంలోని పలువురు విద్యార్థుల ఆత్మ హత్యలపై ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ భాజపా రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ నిమ్స్ ఆస్పత్రిలో దీక్షను కొనసాగిస్తున్నారు. సోమవారం ఉదయం భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఆయన నిరవధిక నిరాహార దీక్షకు దిగిన విషయం తెలిసిందే. అయితే మధ్యాహ్నం పోలీసులు ఆయన దీక్షను భగ్నం చేసి అరెస్టు చేశారు. అనంతరం నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అయితే, పోలీసులు తనను అరెస్టు చేసినా, జైలుకు పంపినా ఇంటర్ విద్యార్థులకు న్యాయం జరిగేదాకా తన పోరాటం కొనసాగుతుందని చెప్పిన లక్ష్మణ్ నిమ్స్ ఆస్పత్రిలోనే దీక్షను కొనసాగిస్తున్నారు.

## తెలుగు రాష్ట్రాల డీజీపీల సమావేశం

హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల డీజీపీలు సోమవారం హైదరాబాద్‌లో సమావేశం అయ్యారు. భేటీ అనంతరం డీజీపీలు గవర్నర్ నరసింహన్‌తో సమావేశం కానున్నారు. ఈ భేటీలో ప్రధానంగా రెండు రాష్ట్రాల మధ్య పోలీస్ విభజన, సమస్యలపై చర్చ జరుగుతున్నట్లుగా సమాచారం.

### ఇంటర్ సప్లిమెంటరీ

## పరీక్ష ఫీజు గడువు పెంపు

### ఇంటర్ బోర్డు కార్యదర్శి అశోక్‌కుమార్

హైదరాబాద్ : తెలంగాణ ఇంటర్ సప్లిమెంటరీ పరీక్ష ఫీజు గడువును ఇంటర్ బోర్డు మరోసారి పొడిగించింది. ఫీజు గడువు ముగుస్తుండడంతో విద్యార్థులు, తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు దానిని మే 2వ తేదీ వరకు పొడిగించినట్టు ఇంటర్ బోర్డు కార్యదర్శి అశోక్‌కుమార్ ఓ ప్రకటనలో వెల్లడించారు. కళాశాల ప్రిన్సిపాల్స్ కూడా మే 2వ తేదీనే ఆన్‌లైన్ ద్వారా బోర్డుకు ఫీజు చెల్లించాలని అశోక్‌కుమార్ సూచించారు. మొదట ఫీజు చెల్లింపునకు ఈ నెల 27 తుది గడువుగా నిర్ణయించగా..ఆ తర్వాత 29కు పెంచిన విషయం తెలిసిందే.

## బాబూ.. ఎక్కడుంది ప్రజాస్వామ్యం?



### వర్మ ప్రెస్‌మీట్ పెడితే తప్పేంటి?

### ఇది ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ

### వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి

హైదరాబాద్ : ప్రముఖ సినీ దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ పట్ల రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించిన తీరును వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

తరువాయి 2లో..








### తుఫాన్ సందర్భంగా అధికారులు

## సర్వసన్నద్ధంగా ఉండాలి

### జిల్లా కలక్టర్ కె.భాస్కర్

విశాఖపట్నం: మే నెల 2, 3 తేదీలలో తుఫాను విశాఖకు దగ్గరగా రానున్నందున తీర ప్రాంత మండలాల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలక్టర్ కె.భాస్కర్ ఆదేశించారు. సోమవారం ఉదయం కలక్టర్ ఫణి తుఫాను హెచ్చరికలను పురస్కరించుకుని తీసుకోవలసిన జాగ్రత్తలపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలక్టర్ మాట్లాడుతూ ఈ నెల 30వ తేది రాత్రినుండి వర్షాలు కురవడం ప్రారంభమవుతాయని,

తరువాయి 2లో..

### సుజనా చౌదరికి మరోసారి

## సీబీఐ నోటీసులు

హైదరాబాద్: తెదేపా ఎంపీ, కేంద్ర మాజీ మంత్రి సుజనా చౌదరికి సీబీఐ మరో నోటీసు పంపింది. మే 4న జరిగే విచారణకు హాజరు కావాలని సీబీఐ ఆ నోటీసుల్లో సూచించింది. మరోవైపు ఆ నోటీసులను సవాలు చేస్తూ సుజనా చౌదరి తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. సీబీఐ నోటీసులు రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. బెస్ట్ అండ్ క్రాంప్టన్ సంస్థతో తనకు సంబంధం లేదని.. తన ప్రతిష్ఠ దెబ్బతీసేందుకే నోటీసులు ఇస్తున్నారని సుజనా ఆరోపించారు. ఇటీవల బెంగళూరు బ్రాంచ్‌కు చెందిన సీబీఐ అధికారులు ఆయనకు నోటీసులు పంపారు. ఆంధ్రాబ్యాంకును మోసగించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న కేసుకు సంబంధించి ఈనెల 26న బెంగళూరులోని సీబీఐ కార్యాలయానికి హాజరు కావాలని సుజనాకు సూచించారు. అయితే ఆ విచారణకు సుజనాచౌదరి హాజరుకాలేదు. తాజాగా మరోసారి నోటీసులు ఇవ్వడంతో ఆయన హైకోర్టును ఆశ్రయించారు.




# విజయభాను సంపాదకీయం

## చమురు ఆంక్షలు

ఇరాన్ మెడకు ఆంక్షలతో అమెరికా ఉరిపేనుతున్నది. ఇరాన్ నుంచి చమురును దిగుమతి చేసుకుంటున్న భారత్, చైనా, జపాన్ సహా ఎనిమిది దేశాలను దిగుమతులను పూర్తిగా నిలిపేయాలని అమెరికా ఆదేశిస్తున్నది. లేదంటే ఆంక్షలు తప్పవని హెచ్చరిస్తున్నది. తద్వారా ఇరాన్ ను ఆర్థిక దిగ్బంధం చేసేందుకు సన్నద్ధం అవుతున్నది. ఏడాది కిందట కూడా ఇలాగే చమురు దిగుమతిని నిలిపేయాలని భారత్, చైనా సహా మిగతా దేశాలను ఆదేశించింది. అప్పటికప్పుడు చమురు దిగుమతులను రద్దు చేసుకుంటే ఆయా దేశాల ఆర్థిక వ్యవస్థలు, జనజీవనంపై తీవ్ర ప్రభావం పడుతుందన్న వివిధ దేశాల భయాందోళనలతో అమెరికా కొంత వెనుకకు తగ్గింది. మే నెల రెండవ తేదీ వరకు అవకాశం కల్పించింది. ఇప్పుడిక మే నెల రెండో తేదీ నుంచి ఎట్టిపరిస్థితుల్లోనూ ఇరాన్ నుంచి చమురును దిగుమతి చేసుకోవద్దని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హుకుం జారీచేస్తున్నాడు. ఇరాన్‌ను ఆర్థికంగా దెబ్బతీసేందుకు చమురు ఎగుమతులను పూర్తిగా అడ్డుకోవాలని పావులు కదుపుతున్నాడు. అమెరికా చేపట్టిన ఈ చర్య అమెరికా, ఇరాన్ మధ్య సమస్యగానే ఉండేది కాదు. ఇరాన్ మీది కోపం భారత్‌లాంటి చమురు దిగుమతి చేసుకునే దేశాలకు శాపంగా మారే పరిస్థితి ఉండటం గమనార్హం. చమురు నిల్వలపై ఆధిపత్యం కోసం పశ్చిమాసియాపై కన్నేసిన అమెరికా చేయని దాష్టీకం లేదు. వివిధ దేశాలను అనేక సాకులతో అదిరింపు బెదిరింపులకు గురిచేసి లొంగదీసుకునే చర్యలకు దిగింది. అంతర్గత ప్రజాస్వామ్య పరిరక్షణ, అణ్వస్త్ర ప్రమాదాన్ని నివారించే పేరిట నేరుగా జోక్యం చేసుకుని ఆయా దేశాలలోని రాజకీయ వ్యవస్థలను కూలదోసింది. ఇరాన్‌పై ఆంక్షల మూలంగా జరిగే చమురు లోటును సర్దుబాటు చేస్తామని అమెరికా అనుం గు దేశం సౌదీ అరేబియా అంటున్నది. కానీ దాన్ని నమ్మదగ్గ వనరుగా పరిగణించే పరిస్థితి లేదు. అంతకన్నా ముఖ్యంగా ఇరాన్, భారత్ దశాబ్దాలుగా బలమైన స్నేహసబంధాలు గల దేశాలు. అమెరికా ఒత్తిడి కారణంగా ఇరాన్ నుంచి చమురు దిగుమతులను నిలిపేసి ఉపఖండంలో అలీన దేశంగా భారత్‌కు ఉన్న ప్రతిష్టను దిగజార్చుకోవటం మంచిది కాదు. అంతే కాదు, అమెరికా ఆదేశాలను శిరసావహించే స్థితిలో భారత్ తన దౌత్య, విదేశాంగ విధానాలను బలిపెట్టడం హర్షించదగింది కాదు. చమురు నిల్వలు తమ భూ భాగాల్లో ఉండటమే శాపంగా ఇరాక్, లిబియాలాంటి దేశాలను అమెరికా చెరబట్టి ఆ దేశాధినేతల ప్రాణాలనే తీసింది. పశ్చిమాసియాలో అమెరికా అదుపాజ్ఞల్లో లేని దేశంగా ఇరాన్ ఒకటే మిగిలి ఉన్నది. ఇరాన్ ను కూడా లొంగదీసుకుంటే పశ్చిమాసియా ఆసాంతం తన అదుపాజ్ఞాల్లో ఉండటమే కాదు, మొత్తంగా ప్రాచ్య, యూరప్ దేశాలన్నీ తన కనుసన్నల్లో మెలగాల్సిన స్థితి తీసుకురావాలన్నది అమెరికా ఎత్తుగడ. దీనికోసం ఎప్పటిలాగానే అణ్వాస్త్రాలు తయారుచేస్తున్నారన్న సాకును బయటకు తీసింది. గతంలో ఇరాక్‌పై కూడా ఇదే సాకుతో దాడిచేసింది. ఇప్పుడు ఇరాన్ వంతు అయ్యింది. కొన్నేండ్లుగా అమెరికా ఆంక్షలతో ఇరాన్ అనేక సమస్యలను ఎదుర్కొంటున్నది. పాలు, ఔషధాలు, నిత్యావసరాలూ తీరని దుర్భరస్థితిలో ఇరాన్‌లో ప్రజలు, పసి పిల్లలు చనిపోతున్న స్థితి ఉన్నది. చమురు ఎగుమతులను పూర్తిగా అడ్డుకోవటం ద్వారా ఇరాన్‌ను పూర్తిగా దిగ్బంధం చేసి పాదాక్రాంతం చేసుకోవటానికి అమెరికా ప్రయత్నిస్తున్నది. ఉరిమి ఉరిమి ఊరుమీద పడ్డట్లు అమెరికా ఆగ్రహం ఇరాన్ మీద అయితే, దాని ప్రభావం చమురు దిగుమతి చేసుకుంటున్న దేశాలు ఎందుకు అనుభవించాలన్నదే ఆలోచించాల్సిన అసలు విష యం. మన దేశ అవసరాల్లో 80శాతం చమురు విదేశాల నుంచే దిగుమతి చేసుకుంటు న్నాం. భారత్‌కు అధికంగా చమరు సరఫరా చేసున్న దేశాల్లో ఇరాక్, సౌదీ అరేబియా, ఇరాన్ ఉన్నా యి. ఇరాన్ నుంచి రోజుకు రెండు లక్షల బ్యారెళ్ల ముడిచమురు భారత్‌కు దిగుమతి అవుతున్నది. ఇంత పెద్ద మొత్తం చమురు దిగుమతి ఆగిపోతే దేశంలో పెట్రోలియం ఉత్పత్తుల ధరలు ఆకాశాన్నంటే ప్రమాదం ఏర్పడుతుంది. నిత్యావసర వస్తువుల ధరలు చుక్కలంటుతాయి. ఇరాన్‌పై ఆంక్షల మూలంగా జరిగే చమురు లోటును సర్దుబాటు చేస్తామని అమెరికా అనుం గు దేశం సౌదీ అరేబియా అంటున్నది. కానీ దాన్ని నమ్మదగ్గ వనరుగా పరిగణించే పరిస్థితి లేదు. అంతకన్నా ముఖ్యంగా ఇరాన్, భారత్ దశాబ్దాలుగా బలమైన స్నేహసబంధాలు గల దేశాలు. అమెరికా ఒత్తిడి కారణంగా ఇరాన్ నుంచి చమురు దిగుమతులను నిలిపేసి ఉపఖండంలో అలీన దేశంగా భారత్‌కు ఉన్న ప్రతిష్టను దిగజార్చుకోవటం మంచిది కాదు. అంతే కాదు, అమెరికా ఆదేశాలను శిరసావహించే స్థితిలో భారత్ తన దౌత్య, విదేశాంగ విధానాలను బలిపెట్టడం హర్షించదగింది కాదు.

## సందేశాత్మక చిత్రాలను నిర్మించాలి



విశాఖపట్నం : భారత వికాస్ పరిషత్ వైజాగ్ ఫిలిమ్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో ద్వారకానగర్ పబ్లిక్ లైబ్రరీలో 'బచ్చే కచ్చే సచ్చే' చిత్రప్రదర్శన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆంధ్ర విశ్వ కళా పరిషత్ ఉప కులపతి ఆచార్య జి.నాగేశ్వరరావు ప్రసంగిస్తూ సమాజ శ్రేయస్సును ఆకాంక్షిస్తూ ప్రతి దర్శకుడు చక్కని సందేశాత్మక చిత్రాలను నిర్మించాలన్నారు. దర్శకుడు రవి ప్రతీ పాఠశాలలో బచ్చే కచ్చే సచ్చే చిత్రాన్ని ప్రదర్శించే దిశగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. విద్యార్థులలో సత్ప్రవర్తన కలుగజేసే దిశగా బచ్చే కచ్చే సచ్చే చిత్రాన్ని నిర్మించిన సదాశివుని రవిని ప్రశంసించారు. సభాధ్యక్షుడిగా వ్యవహరించిన భారత వికాస్ పరిషత్ నగర శాఖ అధ్యక్షులు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ యువదర్శకుడు రవి చక్కని చిత్రాన్ని నిర్మించారని తెలిపారు. వైజాగ్ ఫిలిమ్ సొసైటీ అధ్యక్షులు ఆచార్య పి.విశ్వనాథం, కార్యదర్శి నరవ ప్రకాశరావు, భారత వికాస్ పరిషత్ జాతీయ స్థాయి ఉపాధ్యక్షులు రమేష్‌చంద్ జైన్, భారత వికాస్ పరిషత్ రాష్ట్రస్థాయి కార్యవర్గసభ్యులు ఎం.వి.రాజశేఖర్, భారత వికాస్ పరిషత్ దక్షిణ ప్రాంతీయ కార్యదర్శి ఎం.వి.వి.సత్యనారాయణ, బచ్చే కచ్చే సచ్చే చిత్రదర్శకుడు సదాశివుని రవి తదితరులు పాల్గొని ప్రసంగించారు.



*విశాఖ ఉత్తర నియోజకవర్గం 12వ వార్డు రామకృష్ణ నగర్ లో శ్రీ షిరిడి సాయి ధ్యాన మందిరం 10 వ వార్షికోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న విశాఖ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీ కె.కె.రాజు గారు మరియు పోతు సత్యనారాయణ,జి.ఉగాది,బొడ్డేటి కిరణ్,ఆలయ కమిటీ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.*

## చలివేంద్రం ప్రారంభం



విశాఖపట్నం: ఎంవీపీ కాలనీలో మజ్జిగ చలివేంద్రం ప్రారంభిం చారు. భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వ హించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పి.వి.ఎన్. మాధవ్ హాజరై మజ్జిగ చలివేంద్రం ప్రారంభించారు.

వేసవి కావడంతో ప్రయాణికుల దాహార్తి తీర్చడానికి చలివేంద్రం ఉప యోగపడుతుందన్నారు.

ఈ సందర్భంగా ఈస్టు ఇన్‌ఛార్జి ధనుంజయనాయుడు, భాజపా వార్డు నాయకులు మాజీ సైనికాధికారి పంచదార్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## రాజన్న రాజ్యం జగనన్న తోనే సాధ్యం- కె కె రాజు



విశాఖపట్నం: విశాఖ జిల్లా మస్జీద్ ల సమాఖ్య ప్రెసిడెంట్ అహ్మదుల్లా ఖాన్, న్యూ కోలని మస్జిద్ ప్రెసిడెంట్ నూర్ అహ్మద్ లు విశాఖ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె కె రాజు ను సోమవారం బాలయ్య శాస్త్రి లేవుట్ లో గల పార్టీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలసారు. ఈ సందర్భంగా కె కె రాజు మాట్లాడుతూ జరిగిన ఎన్నికల్లో ఎక్కువ శాతం వైస్సార్ పార్టీ ఓటు వేశారని మన జగనన్న ముఖ్యమంత్రి అవుతారని మాట్లాడుతూ స్వర్గీయ రాజశేఖర్ రెడ్డి గారి పాలన ఎలా చూసామో అంతకంటే మెరుగ్గా మన మన జగన్మోహన్ రెడ్డి గారు పాలన చూస్తామని చెప్పారు. నవరత్నాలు పథకాలు ద్వారా అందరికి లబ్ధి చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో 32 వార్డు అధ్యక్షులు కె.వి.బాబా,నగర కార్యదర్శి అబ్బాస్,యం.డి.గౌస్, తదితర ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా సర్వసభ్య సమావేశం



పరవాడ: మండలపరిషత్ సర్వసభ్యసమావేశము సోమవారము మండలపరిషత్ కార్యలయంలో ఎంపిపి మాసవరపు అప్పలనాయుడు అద్యక్షతనప్రశాంతంగా జరిగింది.ప్రభుత్వ అమలు ప్రగతిపై శాఖలవారిగా సమీక్ష నిర్వహించారు.వైద్యపరంగావేసవికాలంలో ఎండతీవ్రతకు అనేకమంది వడదెబ్బకు గురికాకుండా పలు జాగ్రత్తలుతీసుకోవాలనీ పరవాడవైద్యాదికారణి డాక్టర్ ప్రమీల అన్నారు.తాగునీటి సమస్యలుపై పలువురు సభ్యులు సభదృష్టికితీసుకువచ్చారు. జిల్లాతెలుగు యువతఅర్గనైజింగ్ కార్యదర్శి వియ్యపుచిన్నా మండలములో గల వైన్ షాపుల్లో ప్రతిమందుబాటిల్ పై ఎమ్ అర్ పి ధరకన్నఐదురూపాయాలు అదికంగా తీసు కుంటున్నారనీ సభదృష్టికితీసుకు వచ్చారు.ఈసమస్యలుపై స్పందించిన సభాఅద్యక్షులు ఎంపిపి మాసవరపు అప్పలనాయుడుమాట్లడుతూ వేసవికాలంలో ప్రతి పంచాయితీలో మెడికిల్ క్యాంపులు ఏర్పాటుచేయాలనీ అదేశించారు.తాగునీటి సమస్యపై తక్షణమేచర్యలు తీసుకోవాలనీ అర్ డబ్లూయస్ వర్క్ ఇన్స్ పైక్టర్ పైలరమణకు అదేశించారు.అదికధరకు మద్యం విక్రయంపై ఎంపిపిమాసవరపు అప్పలనాయుడు ఘాటుగాస్పందించారు.అధికదరకు మద్యం విక్రయిస్తే ఉన్నతఅదికార్లుకు పిర్యాదు చేస్తామనీ ఎంపిపి అన్నారు.మండల విద్యాశాఖాఅదికారణి సునీత మాట్లడుతూ పరవాడమండలాన్నీ కరువు మండలముగా ప్రకటించడముద్వారా ప్రతిపాఠశాల్లో మద్యహ్న బోజనపథకాన్ని అమలుచేస్తున్నామనీ అన్నారు.మద్యహ్న బోజనపదకానికివిద్యార్దులు సంఖ్యచిలాతక్కువుగా ఉందనీ విద్యార్థులు సంఖ్యపెరగడానికి విద్యార్దులు తల్లి దండ్రులు, ప్రజాప్రతినిదులుసహకరించాలనీఅమె కోరారు. స్కూల్ పున:ప్రారంభానికివిద్యార్దులుకు కావల్సిన పుస్తకాలు, బూట్లు!యూనిఫాం పంపిణీ చేయడానికీసిద్దంగాఉన్నాయనీ అన్నారు.ఈకార్యక్రమంలో జిల్లాప్రాదేశిక సభ్యులు పైలజగన్నాదరావు,వైస్ ఎంపిపి చింతకాయలసుజాత,ఎమ్ డిఒ శ్రీనువాసురావు,ఎమ్ ఇ ఒ సునీత,ఇఒఅర్ డి హేమసుందర్ మరియు మండలములో గల ఎంపిటిసిలు, తాజామాజీసర్పంచ్లు తదితరులు పాల్గొన్నారు.



*విశాఖ జిల్లా, అనంతగిరి ప్రాంతం నుంచి, పెందుర్తి మీదుగా విశాఖ తరలించడానికి కారులో బయలుదేరి వస్తున్న గంజాయి ని పట్టుకున్నా టాస్కోఫ్స్ పోలీసులు. కారులో వెనుక సీటు కింద గంజాయి ప్యాక్ లను అమర్చిన దుండగులు.కార్ నంబర్ డబ్ల్యూ బి.02.ఎక్స.1876 అనే నెంబర్ తో గల కారు తో పాటు ఇద్దురు వ్యక్తులు ఒక మహిళ అదుపులోకి తీసుకున్న టాస్కోఫ్స్ పోలీసులు.*

## పైడితల్లి అమ్మవారి హుండీ లెక్కింపు

విజయనగరం : శ్రీపైడితల్లి అమ్మవారి (చదురుగుడి) ఆలయం హుండీ లెక్కింపు సోమవారం శ్రీపైడితల్లి దేవస్థానం కళ్యాణ మండపంలో జరిగింది. దేవస్థానం ఇఓ టి.అన్నపూర్ణ పర్యవేక్షణలో సూపరింటెండెంట్ అసిస్టెంట్ రామారావు ఆలయ అర్చకులు, వేదపండితులు వి.నరసింహమూర్తి, రాజేష్‌శర్మ, సిబ్బంది అమ్మవారి సేవకులు, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

## వైభవంగా అంతర్జాతీయ నృత్య దినోత్సవం

గుంటూరు : సాంస్క ృతికం: గుంటూరు బ ృందావన గార్డెన్స్‌లోని వెంకటేశ్వరస్వామి దేవాలయంలో శ్రీ సాయి మంజీరా కూచిపూడి ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో సోమవారం అంతర్జాతీయ న ృత్య దినోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో భాగంగా నగరంలోని పలువురు కూచిపూడి నాట్య గురువులు, శిష్యులు సామూహికంగా అన్నమాచార్య కీర్తన, అలివేలుమంగ- హరి అంతరంగానికి అనుగుణంగా నృత్యాలు చేశారు.

ఈ సామూహిక న ృత్యనీరాజనాన్ని శ్రీ సాయిమంజీర కూచిపూడి ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపకుడు గురు కాజ వేంకటసుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

# మోడీనీ ఢీ కొట్టే సత్తా చంద్రబాబుకే ఉంది

### - తెలుగుశక్తి అధ్యక్షుడు బి.వి.రామ్



విశాఖపట్నం : ఎన్నికల కమిషన్ నియమించిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్.వి.సుబ్రహ్మణ్యం ముఖ్యమంత్రికి అధికారం ఏమి లేదని ఓవర్‌యాక్షన్ చేస్తున్నారని ఆదివారం ఉదయం విజయనగరంలోని హోటల్ మయూరిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలుగుశక్తి అధ్యక్షులు బి.వి.రామ్ ధ్వజమెత్తారు. రాష్ట్రంలో అప్రకటిత రాష్ట్రపతి పాలనను అమలు చేస్తుందని అలాగే బీజేపీ చేతిలో కీలుబొమ్మగా ఎన్నికల సంఘం ఉందని మరియు ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్రపతిపాలన విధించాలని భాజపా, వైకాపా ఎప్పటినుంచో కోరుతున్నాయని, దాన్ని ఈసీ ద్వారా అమలు చేస్తున్నట్లు ఉందన్నారు. కౌంటింగ్ విషయంలో సీఎస్ మీటింగ్ పెట్టడం ఏంటని రామ్ ప్రశ్నించారు. ప్రజలెన్నుకున్న సీఎం సమీక్షలు చేయకూడదని ఎన్నికల కమిషన్ అంటోంది. సంబంధంలేని ఎన్నికల విధులపై సీఎస్ ఎలా సమీక్ష జరుపుతున్నారని రామ్ ప్రశ్నించారు. ప్రజాసమస్యలను మరచి, రాజకీయ కార్యకలాపాలు సాధించడం సీఎస్ స్థాయికి తగదు అని రామ్ హితవు పలికారు.

సిఎం చంద్రబాబుపై విమర్శలు చేస్తున్న మాజీ సీఎస్‌లు వైకాపా కార్యకర్తల్లా పని చేస్తున్నారని రామ్ విమర్శించారు. తాము అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు ప్రశ్నించలేదని రామ్ నిలదీశారు ? ఇటువంటి అధికారుల వల్లే రాష్ట్ర పరువు బజారుకి ఈడుస్తున్నారని రామ్ పేర్కొన్నారు.

చంద్రబాబు ఆంధ్రప్రదేశ్‌లో గెలవటం ఎలాగూ జరుగుతుంది. కాని ఈవిఎంలో ఇక్కడ జరిగిన లోపాలు మిగతా రాష్ట్రాల్లో జరగకుండా ఉండడానికే చంద్రబాబు ఢిల్లీకి వెళ్లి పోరాటం చేశారే తప్పా ఓడిపోతారని తెలిస్తే నీలాగే (వై.ఎస్.జగన్) ఇంటిలోనే కూర్చుంటారు కాని ఢిల్లీ వెళ్లి నరేంద్రమోడీని ఎదురిస్తారా? అని వైకాపా అధ్యక్షులు వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డిని రామ్ ప్రశ్నించారు. ప్రధాని మోడీ సర్కారు కేంద్ర, రాష్ట్ర సమైక్యస్ఫూర్తిని విరుద్ధంగా నడుస్తోందని, రాజ్యాంగ వ్యవస్థను నాశనం చేస్తోందని రామ్ మండిపడ్డారు. పోలవరం, అమరావతి నిర్మాణం వేగంగా జరిగేలాగా ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహిస్తే మాత్రం భూతద్దంలో చూపిస్తున్నారు ? అని రామ్ తెలిపారు. ఆంధ్రలో గొడవ చేసిన విద్యావేత్త, అపరమేధావి, నిత్యకృషీవలుడు మన ప్రముఖ నటుడు మరియు వైకాపా నాయకుడు మంచు మోహన్‌బాబు తెలంగాణలో 19 మంది ఇంటర్ విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటే అరవడం లేదు ఎందుకంటే తెలంగాణ ప్రభుత్వం చూస్తే ఉచ్చ అరవాలంటే. వైకాపా ఎంపి విజయసాయిరెడ్డికి మానసిక స్థితి సరిగ్గా లేకపోవడం వలన దిగజారి మాట్లాడుతున్నారని తెలుగుశక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ ధ్వజమెత్తారు. తెలంగాణ ఇంటర్ బోర్డు అధికారులపై 17 మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్న కారణంగా వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్‌ను బి.వి.రామ్ డిమాండ్ చేశారు.



***2019 సాధారణ ఎన్నికలను సజావుగా నిర్వహించినందుకు గాను నగర పోలీసు కమిషనర్ నగరంలోని అన్ని జోన్లకు bara khana ఏర్పాటు చేయడం జరిగింది ఇందులో భాగంగా ఏఆర్ సిబ్బందికి ఇచ్చిన ఢీుఖీుు ఎష్ట్రుఖుు లో గౌరవనీయులైన నగర పోలీస్ కమిషనర్ గారు పాల్గొనడం జరిగింది అదేవిధంగా ఈ రోజు అనగా 29-4-2019 నాడు పోలీస్ కమిషనర్ గారు ా.ఎ.ా మరియు పై స్థాయి సిబ్బంది కి సూట్కేసులను కృతజ్ఞతగా అందజేసినారు.***

రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
విజయభాను క్లాసిఫైడ్స్
Minimum 7 days
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

# వారిజ ఆశ్రమంలో 20వ వేద విద్య సమ్మేళనం



భీమునిపట్నం : భీమిలి మండలం కె నగరప్పాలెం పంచాయతీ మంగమారి పేట రామాద్రి లో ఉన్న వారిజ ఆశ్రమం లో 20 వ వేద విద్య సమ్మేళనం ఘనంగా జరిగింది. ఈ సమ్మేళనం ను త్రిదండి చిన జీయర్ స్వామి ప్రారంభించారు. ముందుగా ఆయన వేదాల సారం ను వివరించారు. అనంతరం చతు ర్వేద పారాయణ వేద విద్యార్థులకు పరీక్షలు, వేద శాస్త్ర పండితులతో ప్రవచనాలు నిర్వహించారు. దీనికి అధిక సంఖ్యలో వచ్చిన భక్తులకు స్వామిజీ తీర్థ ప్రసాదాలు అంద జేశారు. ఈ కార్యక్రమం లో పండితులు అధ్యా త్మిక వేత్తలు, విశాఖ తూర్పు వై. సీ.పి. తూర్పు అభ్యర్థి అక్రమాని విజయ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

# గ్రంథాలయ వేసవి శిక్షణా శిబిరంలో యోగా ధ్యానంపై అవగాహన కార్యక్రమం



సింహాచలం : 72 వ వార్డు పరిధి సింహాచలం రాజవీధిలో గల శాఖ గ్రంథాలయంలో ఏర్పాటుచేసిన వేసవి శిక్షణా శిబిరంలో ఆరవ రోజు శిబిరానికి భారీగా విద్యార్థిని విద్యార్థులు భారీగా హాజరుకాగా మాస్టర్ బి విజయ్ నేతృత్వంలో విద్యార్థిని విద్యా ర్థులకు యోగా మరియు ధ్యానం చేయటం నేర్పించి చేయటం ద్వారా ఆరో గ్యానికి కలిగే లాభాలను వివరించి అవగా హనా కల్పించారు. అనంతరం యూ నాగా ర్జున న్యాయ నిర్ణేతగా కోకో మ్యూజి కల్ చైర్ ఆటలు ఆడించారు యూ రాజుగారు పిల్ల లకు కథలు చెప్పి వారితోకూడ కథలు చెప్పిం చారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమౌతున్న రీడర్స్ కె.కుమార్, కె ప్రియాంక,ముంతాజ్ బేగం అభినవ్ నాగరాజు తదితరులు పాల్గొనగా గ్రంథాలయ అధికారి పివిఎన్ రాజు విద్యార్థులకు గ్రంధాలయం ఆవశ్యకత కలిగే ప్రయో జనాలుగూర్చి వివరించారు.

# శిఖామణికి చందుసాహితీ పురస్కారం

యానాం : యానాంకు చెందిన ప్రముఖ కవి, కవి సంధ్య సంపాదకులు, కేంద్ర సాహిత్య అకాడమీ సలహా మండలి సభ్యులు కళారత్న డా.శిఖామణి చందు సుబ్బారావు లిటరరీ ట్రస్టు ప్రతి ఏటా ఇచ్చే ప్రతిష్టాత్మక సాహితీ పురస్కారానికి ఎంపిక అయినట్లు ట్రస్టు కార్యదర్శి ఉప్పల అప్పలరాజు ఒక ప్రకటనలో తెలియజేశారు. అచార్య చందు సుబ్బారావు పుట్టిన రోజైన మే 18న ఉదయం 10 గంటలకు విశాఖపట్నం పబ్లిక్ లైబ్రరీ హాలులో జరిగే సాహితీ సభలో శిఖామణికి పదివేల రూపాయల నగదు, జ్ఞాపిక సత్కారంతో పురస్కార ప్రదానం జరుగుతుంది. ట్రస్టు ఛైర్మన్ ఆచార్య కె.ఎస్.చలం అధ్యక్షతన జరిగే సభలో చందు సుబ్బారావు, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణమూర్తి, జగద్ధాత్రి పాల్గొంటారు. ఈ పురస్కార గ్రహీత డా.శిఖామణి కవిత్వంపై కొప్పర్తి వెంకట రమణమూర్తి ప్రధానంగా ప్రసంగిస్తారు. గతంలో ఈ పురస్కారం ప్రజా గాయకుడు వంగపండు ప్రసాదరావు, పద్మశ్రీ కొలకటూరి ఇనాక్ వంటి ప్రముఖులు అందుకున్నారు. ఈ మేరకు చందు లిటరరీ ట్రస్టు, విశాఖపట్నం వారి నుండి లేఖ అందినట్లు శిఖామణి ఒక ప్రకటనలో తెలియ జేశారు. శిఖామణికి పురస్కారం రావడం పట్ల మంత్రి మల్లాడి కృష్ణారావు, కవులు దాట్ల దేవదానంరాజు, మధునాపంతులు, చిన్నారి, చెల్లి రవి, అశోక్ అభినందనలు తెలియజేశారు.

# వైభవంగా అంబేద్కర్ జాతర మహొత్సవం

దేవరాపల్లి : అంబేద్కర్ 128 వ జయంతి పురస్కరించుకుని అంబేద్కర్ జాతర మహొత్సవ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది .స్థానిక అంబేద్కర్ యూత్ సంఘము అధ్వర్యంలో సోమవారం ఆయన చిత్రపటంతో భారీ ఉరేగింపు నిర్వహించారు ,అంతక ముందు కాలనీలో నిలిజెండా ఆవిష్కరించి ,సామాజిక భవనంలో గ్రంధాలయాన్ని ప్రారంభించారు .అదే విధంగా నాలుగు రోడ్ల కూడలిలో అంబేద్కర్ విగ్రహం వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన స్టీల్ మెట్లను దళిత నాయకులు ప్రారంభించి ,అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళిలు అర్పించారు .పూలమాలలు వేసిన వారిలో ఎమ్మెల్యే బూడి ముత్యాలనాయుడు ,మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు ,ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు ,లలితా నాయుడు ,గాలి రవికుమార్ ,బండారు రామారావు ,దళిత నేతలు ,ప్రముఖ న్యాయవాది భైపా అరుణకుమార్ ,పాల్తేటి పెంటారావు ,గాలి పేతురు, నెక్కల నాగమణి ,గొల్ల రాంమూర్తి,ఏ .ఉదయభాస్కర్ లు ఉన్నారు. ఈ కార్యక్రమంలో సంఘము అధ్యక్షులు కాటపల్లి అప్పారావు, కె.సన్నిబాబు, ఎస్.రాజబాబు, కె.అచిబాబు,సన్యాసిరావు, శివశంకర్, చంటి, రవి, కె.అప్పరావు తదితరులు పాల్గొన్నారు.

# అప్పన్న స్వర్ణపుష్పాల కొరకు 64 వేలు విరాళం



సింహాచలం : శ్రీ వరాహలక్ష్మీనారసింహస్వామివారికి స్వర్ణ పుష్పార్చనకు వినియోగించే స్వర్ణపుష్పాల నిమిత్తం విశాఖపట్టణం నరసింహానగర్ రైతుబజార్ ప్రాంతానికి చెందిన తాడి వేంకటరెడ్డి కుటుంబసభ్యులు 64 వేల రూపాయల నగదును సోమవారం నాడు ఆలయ ఏఈఓఆర్‌వీఎస్‌ప్రసాద్ మరియు అర్చకస్వాములు వారికి అందజేశారు.

## త్రాగునీరుకు పైప్‌లైన్ మంజూరు చేయాలని వినతి



అనంతగిరి : మండలంలోని అనంతగిరి పంచాయతీ మాలిన వలస గ్రామం లోఐటిడిఏ ప్రాజెక్టు, వెలుగు, సంస్థ ద్వారా పైప్ లైన్ త్రాగునీరు నకు మంజూరు చేయాలని కోరుతూ అనంతగిరి ఎంపీటీసీ సభ్యుడు డి.గంగరాజు గ్రామస్తులు సన్యాసిరావు అప్పారావు శుక్ర సోమన్న లు కలసి ఏ పీ ఎం సురేష్ కుమార్ సిసి శ్రీరాములు కు లిఖితపూర్వకంగా విన్నవించారు స్పందించిన అధికారులు ఏపీమ్ సురేష్ వెలుగు డిపా ర్ట్మెంట్ ద్వారా తాగునీటి నకు సరఫరా చేసేందుకు హామీ ఇచ్చారు.

## గ్యాస్‌బండ పేలి 35 పూరిపాకలు అగ్నికి ఆహుతి



చీడికాడ : విశాఖ జిల్లా చోడవరం మండలం మేజర్ పంచాయితీలో ద్వారకానగర్ వీధిలో సోమవారం మధ్యాహ్నం గ్యాస్ బండ పేలి 35 పూరిపాకలు 15 రేకుల షెడ్లు అగ్నికి ఆహుతి అయ్యాయి. భారీ ఆస్తి నష్టం జరిగింది. 8 మేకలు అగ్నికి ఆహుతి అయ్యాయి. రెండు ద్విచక్ర వాహనాలు కాలి బూడిదయ్యాయి. అక్కడ నివసిస్తున్న ప్రజలు పేదవారు వస్తువులన్నీ అగ్నికి ఆహుతయ్యాయి. సంఘటనా స్థలానికి అనాకపల్లి ఆర్డీవో, చోడవరం ఎమ్మార్వో, అగ్నిమాపక సిబ్బంది అధికారులు వచ్చారు.

# ఫీవర్‌గా ఉంది... పారాసిట్మాల్ టాబ్లెట్స్ ఎక్కడ?



అరకులోయ : మన్యంలో గల పి.ఎచ్.సి, సి.ఎచ్.సి ల్లో పారాసిట్మాల్ మాత్రలు ఇవ్వడం లేదని ఆయా ఆసుపత్రిల్లో చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు మరియు చికిత్స కోసం ఆసుపత్రికి వెళ్లినా రోగులు గగ్గోలు పెడుతున్నారు.సుమారు రెండు నెలల క్రితం నుండి మన్యంలో గల అన్ని ఆసుపత్రిల్లో పారసిట్మాల్ మందులు ఇవ్వక పోవడంతో ఆర్థిక స్థోమత లేని గిరిజనులు ఆవేదన చెందు తున్నారు. ఆసుపత్రికి వెళ్ళే రోగికి ఇచే మందుల్లో తప్పని సరిగా ఉండేది పారాసిట్మాల్ టాబ్లెట్స్. జ్వరం, ఒంటి నొప్పులు,తల నొప్పి వంటి చిన్న,చిన్న సమస్యలు వస్తే ఆర్థిక స్థోమత లేనీ గిరిజనులు ఇంట్లో పెట్టుకునే అత్యవసర మందుగా పారసిట్మాల్ మాత్రలు,వీటిని ఆసుపత్రిలో వైద్యులు కుడా అన్నిటికి కాంబినేషన్ గా రోగులకు ఇస్తారు.అదే విదంగా గ్రామాల్లో పని చేసే (ఆరోగ్య) ఫీల్డ్ వర్కర్స్ చేతిలో ఏ మందులు లేకపోయిన పారాసిట్మాల్ టాబ్లెట్స్ తప్పని సరిగా ఉండాలి,గ్రామాల్లో ఫీల్డ్ వర్కర్లకు రోగులు అడిగేది పారసిట్మాల్ టాబ్లెట్స్ యే అలాంటి సమయంలో వారి చేతిలో పారాసిట్మాల్ టాబ్లెట్స్ లేక పోతే కొంత మంది రోగులు వారితో వాగ్వాదానికి దిగుతున్నారని సమాచారం.కొన్ని ప్రవేటు స్వచ్ఛంద సంస్థ వారే కొన్ని గిరి గ్రామాల్లో గిరిజనులకు ఉచితంగా పారాసిట్మాల్ మందులు కొని సరపర చేస్తుంటే,రెండు మూడు నెలలు అవుతున్న ప్రభుత్వం పారాసిట్మాల్ మాత్రలు ఇవ్వకుండా ఇప్పటి దాక నిద్ర పోతుందని పలువురు ఆర్థిక స్థోమత లేనీ రోగులు అంటున్నారు.కొన్ని లక్షల్లో రోగులు ఉన్న కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వంవారు పారాసిట్మాల్ మాత్రలు ఇవ్వకుండా ఇప్పటి వరకు ఎం చేస్తుంది అంటున్నారు.ఎలాగ చూసిన జిల్లాలో రెండు నెలల్లో రావలసిన 15 లక్షల మాత్రలు సరపర కాలేదు.వీటిలో 8 లక్షల మాత్రలు పి.ఎచ్.సి ల్లో ఇవ్వనుండగ,మిగిలిన 7 లక్షల మాత్రలు ఆయా వీమ్స్,ఛాతి మానసిక ఆసుపత్రి లాంటి వాటిల్లో సరపర చేస్తుంటారు.మరి మన విశాఖ మన్యం అరకులోయ,పాడేరు తదితర ఆసుపత్రిల్లో ప్రభుత్వం వారు, మరియు అధికారులు ఎప్పుడు పారాసిట్మాల్ అందిస్తారో అప్పుడె మారుమూల ప్రాంతంలో జ్వరాలు తగ్గే ముఖం పట్టొచ్చునని అంతవరకు వేచీ చూడాల్సిందేనని పలువురు రోగులు అంటున్నారు.

# స్వయం కృతాభిప్రాయమే శాపమా?

## కనుమరుగు కానున్న నేతల భవిష్యత్



ముద్రగడ పద్మనాభం



బొడ్డు భాస్కర రామారావు

పెద్దాపురం: కాపు ఉద్యమ నేత, మాజీ పార్లమెంటు సభ్యుడు, మాజీమంత్రి మాట తప్పని కార్య సాధ కుడుగా, రాష్ట్రస్థాయిలో ప్రముఖ రాజకీయవేత్తగా, ప్రజల మనిషిగా పేరుపొందిన ముద్రగడ పద్మనాభం, అత్యంత కీలకమైన అసెంబ్లీ ఎన్నికల ప్రస్తుత సమయంలో, ఆయన పాత్ర లేకపోవడం, కనీసం ప్రస్థావనకు రాకపోవడం అందరికి ఆశ్చర్యం కలిగించినదని చెప్పవచ్చు. దీనికి ప్రజా ప్రతినిధిగా పేరుగాంచిన, ప్రముఖ నేత, ఒక సామాజిక వర్గానికి మాత్రమే, ప్రాణాలు తెగించి పోరాడడం, ఏ పార్టీకి పరిమితం కాకపోవడం, ప్రచారంలో లేకపోవడం ముద్రగడకు శాపంగా మారినదని అంటున్నారు. అనేక సమస్యలతో సతమతం అవుతున్న అన్ని వర్గాల ప్రజల, సమస్యల పరిష్కారానికి ముద్రగడ కంకణం కట్టుకొని, ఎన్నికలలో పోటీచేసి ఉంటే, రాష్ట్ర ప్రజలు అందరికి అందుబాటులో వుంటారని ప్రజలు భావించారు. కాని ముద్రగడ మౌనం నిరాశ కలిగించినదని అంటున్నారు. దీనికి తోడు ప్రముఖ సినీనటుడు జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ కూడా అదే సామాజిక వర్గానికి చెందడం, ప్రజా సమస్యల పరిష్కారానికి, ప్రజా ప్రతి నిధిగా ప్రజలలో మమైక్యమై ఎన్నికలలో పాల్గొనడంతో, అన్ని సామాజిక వర్గాల ప్రజలు పవన్ కల్యాణ్ వెంట వెళ్ళి, అసెంబ్లీ ఎన్నికలలో పోటీ చేయడం ముద్రగడను ఏకాకిని చేసినదా? అన్న సందేహం అభిమానులు - ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.

ప్రముఖ నటుడు తెలుగు దేశం పార్టీ వ్యవస్థాపకుడు దివంగత ముఖ్యమంత్రి ఎన్.టి.రామా రావు పార్టీతో పార్టీ ప్రారంభించిన నాటి నుండి, ఆయనతో కలిసి ప్రయోగించి, ఆ తరువాత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి అత్యంత సన్నిహితుడిగా, మాజీ ఎమ్మెల్యేగా, మాజీ ఎమ్మెల్సీగా, ప్రణాళిక బోర్డు ఉపాధ్యక్షుడిగా అనేక పదవులు నిర్వహించిన బొడ్డు భాస్కర రామారావు ప్రస్తుత ఎన్నికలలో కనుమరుగు కావడం అందరికి ఆశ్చర్యం కలిగించినది. గత సాధారణ ఎన్నికలలో బొడ్డు భాస్కర రామారావు వైయస్ ఆర్‌సీపీలో చేరడమే ఆయనకు ప్రస్తుతం శాపంగా మారినది అన్నదే ప్రజల అభిప్రాయం - తిరిగి టీడీపీలో చేరి ఎమ్మెల్సీ పదవి పొందినప్పటికి 2019 సాధారణ ఎన్నికలలో పార్టీ తరపున పోటీలో లేకపోవడం నిరాశ కలిగించిన విషయంగా భావిస్తున్నారు. దానితో బొడ్డు మౌనం వహించారు. 2019 సాధారణ ఎన్నికలలో రాష్ట్రస్థాయిలో ప్రజా ప్రతినిధులుగా పేరుగాంచిన ఇరువురు ప్రముఖ నేతలు, పార్టీల తరపున పోటీ లలో గాని, ప్రచారంలో గాని, కనిపించకపోవడం, వినిపించక పోవడం వారు చేసుకున్న స్వయం కృతాభిప్రాయమే శాపంగా మారినదా? అన్నదే ప్రస్తుత చర్య.

# అంబులెన్స్‌కు దారిఇవ్వండి అనే కార్యక్రమం ఉన్నతమైనది - జిల్లా కలక్టరు డా. యం. హరి జవహర్ లాల్

విజయనగరం : ఒకరిట్జ్ స్కూల్ విద్యార్థులు నిర్వహిస్తున్న గేటవేటు అంబులెన్స్ (అంబులెన్స్‌కు దారి ఇవ్వండి) అనే వినూత్న కార్యక్రమం ఉన్నతమైనదని జిల్లా కలెక్టర్ డా.ఎం. హరి జవహర్ లాల్ అభివర్ణించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో జరిగిన మీకోసం కార్యక్రమంలో ఒకరిట్జ్ స్కూల్ డైరెక్టర్, కోఆర్డినేటర్లు, విద్యార్థులు కలెక్టర్‌ను కలిసి అంబులెన్స్‌కు దారి ఇవ్వండి కార్యక్రమం గురించి కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అంబులెన్స్‌కు దారి ఇవ్వండిపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్న ఒకరిట్జ్ యాజమాన్యానికి, విద్యార్థులను అభినందించారు. ప్రమాదాలకు గురైన వారికి ఎంతోగానో ఉపయోగపడుతుందని, అందరికి అవగాహన పర్చాలని కోరారు. భారతదేశంలో ప్రతిఏటా రహదారి ప్రమాదాల్లో 1.5 లక్షల మంది మరణిస్తున్నారని, సగటున రోజుకు 400 మంది గాయాలబారిన పడుతున్నారని, అందులో సమయానికి అంబులెన్స్ ఆసుపత్రికి చేరకపోవడం వలన ప్రతి పది మందిలో ఇద్దరు మరణిస్తున్నారన్నారు. సమయానికి ఆసుపత్రికి చేర్చడం వలన 70 నుండి 7 శాతం వరకు గుండెపోటుతో మరణించే అవకాశాలు తగ్గుతున్నాయన్నారు. అందువలన ప్రమాదం జరిగిన తొలిగంట కాల వ్యవధిని గొల్డెన్ అవర్‌గా వైద్యులు అభివర్ణిస్తున్నారన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని నగరంలోని ఓకరిట్స్ స్కూల్ విద్యార్థులు గేటివేటు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ఓకరిట్జ్ స్కూల్ డైరెక్టర్ నళినీ శ్రీవాస్తవ, కోఆర్డినేటర్లు వాగ్దేవి కుమార్, తరంగ, ఒకరిట్జ్ విద్యార్థులు నితిష్ రాజ్, సాయి శరణ్య, సంయుక్తలు జిల్లా కలెక్టర్‌ను కలిసి కార్యక్రమం గురించి వివరించారు. ఇప్పటి వరకు వెయ్యి మందికి అవగాహన పర్చడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ కె.వెంకట రమణా రెడ్డి, సంయుక్త కలెక్టర్ -2 జె. సీతారామారావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ప్రజా ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి చర్యలు : జిల్లా ఎస్పీ ఎ.ఆర్. దామోదర్



విజయనగరం : జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ ఎ.ఆర్. దామోదర్ సోమవారం ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను నిర్వహించారు. ఈ వ్యధ విభాగానికి జిల్లా నలుమూలల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి 18 ఫిర్యాదులను జిల్లా ఎస్పీ స్వయంగా స్వీకరించి, ఫిర్యాదు దారులతో మాట్లాడి, ఫిర్యాదు అంశాలను పరిశీలించి, వాటిని పరిష్కరించేందుకు, వాటిపై చర్యలు చేపట్టేందుకు సదరు ఫిర్యాదులను సంబంధిత పోలీసు అధికారులకు పంపారు. విశాఖపట్నం జిల్లా పెందుర్తికి చెందిన అదపా రమణ ఫిర్యాదు చేస్తూ తన అపార్టుమెంటు ఇంటిని బూర్లు రాము అనే వ్యక్తికి అద్దెకు ఇచ్చినట్లు, దానిని అమ్మివేయాలనే ఉద్దేశ్యంతో ఇటీవల ఖాళీ చేయించానని, కానీ, సదరు అపార్టుమెంటు మెయింటినెన్సు, అద్దె, ఇంటి మరమత్తుల నిమిత్తం రూ॥ 20,200లు బకాయి పడినట్లు, సదరు డబ్బులును ఇప్పించాల్సిందిగా కోనివరు. ఈ ఫిర్యాదుపై స్పందించిన జిల్లా ఎస్పీ ఇరువురికి కౌన్సిలింగ్ నిర్వహించి, ఫిర్యాదికి న్యాయం చేయాల్సిందిగా విజయనగరం 1వ పట్టణ సిఐను ఆదేశించారు. చీపురుపల్లికి చెందిన కర్నపు అరుణజ్యోతి ఫిర్యాదు చేస్తూ తన భర్త చెడు వ్యసనాలకు అలవాటు పడి, తనను, శారీరకంగా, మాన సికంగా వేధిస్తున్నట్లు, తనకు విడాకులు ఇచ్చి, తన భర్తకు రెండో వివాహం చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు, న్యాయం చేయా ల్సిందిగా కోరారు. ఈ ఫిర్యాదుపై స్పం దించిన ఎస్పీ ఇరువురికి కౌన్సిలింగ్ నిర్వ హించి, ఫిర్యాదికి చట్టపరంగా న్యాయం చేయాల్సిందిగా చీపురుపల్లి ఎస్ఐను ఆదేశించారు. విజయనగరం పట్టణానికి చెందిన సోమశేఖర్ ఫిర్యాదు చేస్తూ తన భార్య ప్రవర్తన కారణంగా ఇబ్బంది పడినట్లు, తనకు, తన భార్యకు కౌన్సిలింగ్ ఇప్పించాల్సిందిగా కోరారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన జిల్లా ఎస్పీ ఇరువురికి కౌన్సిలింగ్ నిర్వహించాల్సిందిగా మహిళా పిఎస్ డిఎస్పీని ఆదేశించారు. విజయ నగరం పట్టణానికి చెందిన కోటంశెట్టి శ్రీనివాసరావు ఫిర్యాదు చేస్తూ తన గ్యాస్ ఏజన్సీలో కొన్ని వస్తువులు పోయినట్లుగా విజయనగరం 1వ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసాననే నెపంతో స్థానికంగా ఉంటున్న కొంత మంది వ్యక్తులు తన గ్యాస్ ఏజన్సీపై దాడి చేసినట్లు, బెదిరింపులకు పాల్పడినట్లు, న్యాయం చేయాల్సిందిగా కోరారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన జిల్లా ఎస్పీ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేయాల్సిందిగా విజయ నగరం 1వ పట్టణ సిఐను ఆదేశించారు. తెర్లాం మండలం నెమలాంకు చెందిన బోనెల సింహాచలం ఫిర్యాదు చేస్తూ తనను రాజు అనే వ్యక్తి ప్రేమించి, పెద్దల సమక్షంలో గత సంవత్సరం వివాహం చేసుకున్నట్లు, తరువాత పరీక్షలు రాసేందుకుగాను వెళ్ళుతున్నట్లుగా చెప్పి, తనను విడిచిపెట్టి వెళ్ళినట్లు, తనకు న్యాయం చేయా ల్సిందిగా కోరారు.

CHANGE OF NAME
I RENUKA SAHU
(old name)
W/o. Sunil Kumar Sahu,
R/o.39-03-11/3, F.No.301, Aishwarya Flora, Opp.Masjid, Murali Nagar, Visakhapatnam, A.P., have changed my name as
RENUKA SIVANGI
(New Name)

# ప్రభుత్వ పారశాలలపై ఉన్న అపోహలు తొలగించాలి

చీడికాడ : ప్రభుత్వ పాఠశాలలపై ప్రజలలో ఉన్న అపోహలు తొలగిపోయేలా కృషి చేయాలని ఇటీవల ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఎన్నికైన పాకలపాటి రఘువర్మ ఉపాధ్యా యులకు సూచించారు. మండలంలోని కోమాళ్లపూడిలో ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఆయనను ఘనంగా సన్మా నించారు. ఈ సందర్భంగా ఉపాధ్యా యులు మాట్లాడుతూ తమ సమస్యల పరి ష్కారానికి సహకరింఆచలని ఎమ్మెల్సీని కోరారు. సన్మాన గ్రహీత ఎమ్మెల్సీ రఘువర్మ మాట్లాడుతూ తాను ఎల్లవేళలా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలన్నారు.

విధి నిర్వహణలో సమయపాలన పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్.రఘు రామిరెడ్డి, మండల నాయకులు, పలువురు ఉపాధ్యాయులు, బత్తుల తాతయ్యబాబు, గేదెల సత్యనారాయణ, దొండా సన్యాశిరావు తదితరులు పాల్గొన్నారు.

# మీ సేవ దరఖాస్తుల రిజక్షన్ కు కారణాలు తెలియ జేయాలి

విశాఖపట్నం : వివిధ శాఖలలో పెండింగ్ లో ఉన్న గ్రీవెన్స్ పిటిషన్స్ ను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలక్టర్ కె.భాస్కర్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం కలక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో మీకోసం , మీ సేవ, ఈ - ఆఫీసు కార్యక్రమాల అమలును సమీక్ష గావించారు. శాఖల వారీగా పెండెన్సీ ని తెలియ జేస్తూ వాటిని వెంటనే పరిష్కరించాలన్నారు. పోలీసు శాఖలో అత్యధిక కేసులు రిజెక్షన్ చేయబడుతున్నాయని ఈ విషయం పై శ్రద్ధ వహించాలన్నారు. మీ సేవ లో లబ్ధి దారులలు రుసుము చెల్లించి సేవలు పొందుతారని వారికి సకాలంలో సేవలు అందించాలన్నారు. వచ్చిన దరఖాస్తుల పై సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయి ఎంక్వయిరీ గావించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఆఫీసులో కూర్చుని ఎటువంటి చర్యలు చేపట్టరాదన్నారు.

తదుపరి వివిధ శాఖలలో ఈ ఆఫీసు నిర్వహిణ గురించి సమీక్షిస్తూ చాలా శాఖలు ఫెల్స్ను ఈ - ఆఫీసులో పెట్టలేదన్నారు. ఈ - ఆఫీసు నిర్వహణలో హెచ్ ఒ డి క్రిందిస్థాయి వారు కూడా డిజిటల్ సెన్ పెట్టాలన్నారు. లేనిచో అటువంటి వాటిని తిరస్కరిస్తానని స్పష్టం చేశారు. ఈ - ఆఫీసు నిర్వహణ పై అధికారులు, సిబ్బందికి 2 రోజుల శిక్షణ యిప్పించాలన్నారు. జూన్ 1 వ తేదీ తర్వాత వివిధ శాఖలలో ఈ - ఆఫీసు నిర్వహపై తనిఖీ చేయడం జరుగు తుందన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ శ్రీమతి జి.సృజన, డిఆర్ పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# సిఆర్సి ఆధ్వర్యంలో ఉచిత తెలుగు బుల్స్ శిక్షణా శిబిరం

రావులపాలెం : సిఆర్సి సేవా సంస్థ ఆధ్వర్యంలో తెలుగు బుల్స్ కబడ్డి టీమ్‌కు ఉచిత శిక్షణా ఇవ్వనున్నట్లు సిఆర్సి రూపశిల్పి ఆంధ్ర కబడ్డి అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు విక్టరి డా॥ గొలుగూరి వెంకటరెడ్డి తెలిపారు. స్థానిక సిఆర్సి నందు ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిఆర్సి ఎన్నడూ సేవా రంగంలో ముందుంటుందని, యువతను ప్రోత్సహించేందుకు కబడ్డి క్రీడను ప్రోత్సహిస్తూ వెళుతున్నామని దేశంలోనే మొట్టమొదటి సారిగా రావులపాలెం సిఆర్సి క్రీడా ప్రాంగణంలో తెలుగు బుల్స్ కబడ్డి టీమ్‌కు ఉచిత శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు, ఈ శిక్షణా కార్యక్రమంలో కబడ్డిలో అర్జున అవార్డు పొందిన నితా దాడ్వే, మాజీ అంతర్జాతీయ కబడ్డి క్రీడాకారుడు ఎన్. అర్జునరావులు పాల్గొని శిక్షణ నిచ్చెదరని ఆయన తెలిపారు. కబడ్డి క్రీడను ప్రోత్సహించేందుకు శిక్షణ తీసుకునే క్రీడాకారులకు ఉచిత ఎసి గదులు, వసతి, పౌష్టికాహార భోజన సదుపాయములు ఏర్పాటు చేసామన్నారు. న్యూ కబడ్డీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో "ఇన్డో ఇంటర్నేషనల్ ప్రిమియర్ కబడ్డి లీగ్" పోటీలు మే 13 నుండి పూనే, మైసూర్, బెంగుళూరు పట్టణాల్లో జరగనున్నట్లు ఈ పోటీలను డిస్కవరి, డిడి స్పోర్ట్స్, ఎమ్‌టివిల్లో ప్రత్యక్ష ప్రసారం చేయబడునని తెలిపారు. ఈ పోటీల్లో బెంగుళూరు రైనోస్, డైలర్ ఢిల్లీ, పాండి ప్రిడేటర్స్, పూణే ఫ్రైడ్, హర్యానా హీరోస్, ముంబై చేరాజ్, చెన్నై చాలెంజర్స్, తెలుగు బుల్స్ టీమ్‌లు పాల్గొనుచున్నాయన్నారు.

ఈ పోటీలకు సిఆర్సి క్లబ్ రావులపాలెం ఆధ్వర్యంలో తెలుగు బుల్స్ టీమ్‌కు శిక్షణా శిబిరం విద్యుత్ కాంతులలో సింథటిక్ పరుపులపై మే 11 వరకు సిఆర్సి నందు నిర్వహించబడునని తెలిపారు.

ఈ సందర్భముగా ఇటువంటి శిక్షణా తరగతులు నిర్వహిస్తునందుకు సిఆర్సి క్లబ్ యాజమాన్యానికి, ఆంధ్రా కబడ్డి అసోసియేషన్ కార్యవర్గానికి అభినందనలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో సిఆర్సి అధ్యక్ష కార్యదర్శులు మల్లిడి కనికిరెడ్డి, కర్రి అశోక్ రెడ్డి, యలమంచిలి శ్రీకాంత్, డైరెక్టర్ కర్రి సుబ్బారెడ్డి, సిఆర్సి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నియంత్రణకు ప్రజలు సహకరించాలి

### - ట్రాఫిక్ ఎస్ ఐ భరత్ కుమార్

గాజువాక : నిత్యం రద్దిగా ఉండే గాజువాక ప్రధానరహదారులలో ట్రాఫిక్ నియంత్రణకు ట్రాఫిక్ పోలిసులకు ప్రజలు కూడా సహకరించాలని గాజువాక ట్రాఫిక్ ఎస్ ఐ భరత్ కుమార్ అన్నారు . సోమవారం కొత్తగాజువాక కణితిరోడ్డు మర్కెట్ నుండి 60 అడుగుల రోడ్ వరకు ట్రాఫిక్ సీఐ ఎ.వి.లీలారావు పర్యవేక్షణలో ఎస్ ఐ భరత్ కుమార్ ,జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ సిబ్బంది రమేశ్ అధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు . కొత్తగాజువాక మర్కెట్ రోడ్ కి ఇరువైపుల ఉన్న చిరువ్యాపారస్థులు రోడ్డుపైకి వచ్చి వ్యాపారాలు చేయడంతో ట్రాఫిక్ కి అంతరాయం కలుగుతోందని చెప్పేరు. వ్యాపారాలు చేసుకునే వారు రొడ్డుపైకి రాకుండ వ్యాపారాలు చేసుకొవాలని సూచించారు .అలకాకుండా ఎవరైనా రొడ్డుపైకి వ్యాపారాలు చేస్తూ ట్రాఫిక్ అంతరాయంకలిగిస్తు ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు .

## వెంకన్నకు వెండి వస్తువులు, నగదు బహూకరణ



రావులపాలెం : ఆత్రేయపురం మండలం, వాడపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వర స్వామి వార్కి పశ్చిమగోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం తాడిపర్రుకు చెందిన తోట సూర్యనారాయణ 4 కేజీల 131 గ్రాముల వెండి సామాగ్రిని బహూకరించారు. అలాగే అమలాపురంకు చెందిన డిఎమ్ఎస్ శ్రీనివాస్ కుటుంబ సభ్యులు ఆలయ అన్నదాన ట్రస్టుకు రూ.10,777 విరాళంగా అందజేసారు. వీరికి ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు స్వామి వారి చిత్రపటాన్ని ప్రసాదాన్ని అందజేసారు.

## హెచ్‌పిసిఎల్‌నుండి మరో భారీ యంత్రం



ములగాడ: హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ సంస్థ నుండి మరొక భారీ యంత్రం హిందుస్థాన్ షిప్ యార్డ్ నుండి హెచ్పీసీఎల్ తరలించారు ఈ తరలింపులో మొబైల్ వాహనం ద్వారా తరలిస్తుండగా వాహనం యొక్క టైర్లు మీద లోడు ఎక్కువవడంతో హైడ్రాలిక్ ప్రొఫెసర్ టైర్లు మీద పడి 3 టైర్లు బ్లాస్ట్ అవ్వడంతో కొంత సమయం ప్రధాన రహదారిపై నిలిచిపోవడంతో ఎల్ అండ్ టీ అధికారులు హెచ్పిసిఎల్ అధికారులు చౌక చక్యంగా వెంటనే వాహనం యొక్క టైర్లను మార్పిడి చేయించి యంత్రాన్ని సంస్థ వరకు తరలించారు ఇది యంత్రం ఇండియాలోనే అతి ఎక్కువ బరువు గల యంత్రమని దీని బరువు సుమారు 1700 మెట్రిక్ టన్నులు ఈ యొక్క పొడవు 55 మీటర్లు వెడల్పు 9 మీటర్లు హైట్ ఎనిమిది మీటర్లు అని అధికారులు వచ్చేనెల ఇంతకంటే భారీ యంత్రాలు రావాల్సి ఉందని తెలిపారు ఈ యంత్రం తరలింపులో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా హెచ్పిసిఎల్ అధికారులు ఎల్ టి అధికారులు మరియు మల్కాపురం ట్రాఫిక్ సీఐ వాసుదేవరావు ఎస్సై శ్రీ రంగులు సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్సై చేతులమీదుగా మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

రావులపాలెం : కోనసీమ ముఖద్వారం రావులపాలెంలో అక్షరదీపికా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో రావులపాలెం ఎన్‌హెచ్16 వద్ద ఎస్సై సిహెచ్ విద్యాసాగర్ చలివేంద్రమును ప్రారంభించారు. ఈ సందర్భముగా విద్యాసాగర్ మాట్లాడుతూ విద్యా సంస్థలో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రజల దాహార్తిని తీర్చడానికి వడదెబ్బ నుంచి ప్రజలను రక్షించడానికి చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పోతంశెట్టి కనికిరెడ్డి, పడాల సోమిరెడ్డి, పడాల రామకృష్ణారెడ్డి, దుళ్ళ వెంకటేశ్వర్లు, గొలుగూరి సత్యనారాయణరెడ్డి, మద్దింశెట్టి శ్రీను, పడాల బులిరెడ్డి, కొవ్వూరి సతీష్‌రెడ్డి, ద్వారంపూడి మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అప్పన్నహుండీ లెక్కింపు 1,24,98,000 భారీ ఆదాయం

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మి నరసింహస్వామి వారి హుండీ లెక్కింపు సింహగిరిపె దేవస్థానం అధికారులు చేపట్టారు భక్తులు 31 రోజులుకు గాను కోటి ఇరవై నాలుగు లక్షల తొంబై ఎనిమిది వేల రూపాయలు నగదు రూపంలో చేకూరగా బంగారం 0.134. 500 గ్రాములు, వెండి 12.085.000 కేజీ లు, విదేశీ కరెన్సీ యూ ఎస్ 369డాలర్లు, ఖతర్ 670 రియాధ్స్, బాంక్ అఫ్ మలేషియా 345అర్ ఎం, సింగపూర్ 74 డాలర్లు , ఆస్ట్రేలియా 5 డాలర్స్, కెనడా 10 డాలర్లు చేకూరాయి. ఈ లెక్కింపు కార్యక్రమంలో దేవస్థాన సిబ్బంది మరియు స్వచ్ఛంద సేవకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎండాకాలంలో (పి.టి.జి) గిరిజనులు చోడి పంట సాగు



అరకులోయ : అందాల ఊటీ అరకులోయ కోడై కనల్, అరకులోయ మన్యం, మాదల పంచాయతీ మారుమూల పి.టి.జి (కోదు) ఆదిమ జాతి గిరిజనులు ఈ మండుటెండలో కుడా తమరు ప్రధాన పంటగా భావించే చోడి పంట సాగు చెయ్యడం చాల ఆశ్చర్యం పరుస్తుంది. ఇక్కడ గిరిజనులు ఆర్గానిక్ పంటలు పండించడం చాల గొప్పగా ఉంది. ఇక్కడ రైతులకు ప్రభుత్వం వారు ఇరిగేషన్ సదుపాయాలు కల్పిస్తే మరింత పంటలు పండించి అభివ ృధి చెందుతారు. తాజా వంకాయ వంటి అనేక రకాల పంటలు పండిస్తున్నారు. ప్రభుత్వం వారు గిట్టుబాటు ధరలు ఇస్తే మరింత ఆర్థిక అభివ ృధి చెందే అవకాశం ఉందని సి.పి.ఎం రాష్ట్ర సభ్యుడు కిల్లో సురేంద్ర (సి.పి.ఎం శాసనసభ అభ్యర్థి గిరిజనుల భవిష్యత్) తో మండలం నాయకులు కె.రామరావు, రామన్నలు సోమవారం సందర్శన సందర్భంగా అన్నారు.

# కోరమండల్ ఆధ్వర్యంలో చిన్నారులకు వైద్యశిబిరం

## కలక్టర్ కార్తికేయ మిశ్రా సందర్శన



కాకినాడ రూరల్ : సామాజిక సేవలో భాగంగా కోరమండల్ ఆధ్వర్యంలో చిన్నారులకు గుండె వ్యాధి శిబిరం నిర్వహించి వైద్యసేవలు అందించడం అభినందనీయమని కలెక్టర్ కార్తికేయ మిశ్రా అన్నారు. కాకినాడ రూరల్ వలసపాకల కోరమండల్ మెడికల్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన చిన్నారుల గుండె వైద్య శిబిరానికి కలెక్టర్ విచ్చేసి పర్యావేక్షించి కోరమండల్ సేవలు ప్రశంసించారు.స్టార్ హాస్పటల్,హైదరాబాదు మరియు హృదయ ఫౌండేషన్ భాగస్వామ్మంతో నిర్వహించిన ఈ శిబిరంలో స్టార్ హాస్పటల్‌కు చెందిన ప్రముఖ పిల్లల గుండె వైద్య నిపుణులు డా.సుమన్ వ్యాస్ చిన్నారులకు వైద్య పరీక్షలుచేసి తల్లిదండ్రులకు తగు సూచనలిచ్చారు. ఈశిబిరంలో తెలుగు రాష్ట్రాల నుండి విచ్చేసి వైద్యపరీక్షలు చేయించుకున్నారు.వీరిలో సుమారు200 మంది గుండె సంబందిత వ్యాధితో బాధపడుతున్నట్లు నిర్ధారించగా 45 మందికి శస్త్ర చికిత్సలకు ఎంపికచేసారు.వీరికి హైదరాబాదు, విశాఖపట్టణం,హస్పటల్‌లలో కోరమండల్ మరియు హృదయ ఫౌండేషన్ సహకారంతో శస్త్ర చికిత్సలు నిర్వహించడం జరుగుతుందని కోరమండల్ కాకినాడ యూనిట్ హెడ్ ఎస్..రవికిరణ్ తెలిపారు.అనంతరం వైద్యపరీక్షలకు వచ్చిన చిన్నారుతో కలక్టర్ ముచ్చడించారు.అలాగే కోరమండల్ మెడికల్ సెంటర్ ఆవరణలో మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో మాజీ వైస్‌ఛాన్సలర్ ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్శిటీ డా. ఐవిరావు,జీజీహెచ్ సూపరిండెంట్ ఎం. రాఘవేంద్రరావు,జీజీహెచ్ పిల్లల వైద్యునిపుణులు డా.కృష్ణ ప్రసాద్,పిపద్మనాభం,హెచ్‌ఆర్‌సిఎస్‌ఆర్ ఇన్‌చార్జ్ వంశీకృష్ణ,,కోరమండల్ యూనిట్ ప్రెసిడెంట్ రాజు,లేడిస్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# వాటర్ స్పోర్ట్స్ కిట్లను పంపిణీ చేసిన కలెక్టర్

విజయనగరం : వాటర్ స్పోర్ట్స్ రోయింగ్ కీయింగ్ నోయింగ్ స్పోర్ట్స్‌కు సంబంధించిన కిట్లను జిల్లా కలెక్టర్ డా.ఎం.హరిజవహర్‌లాల్ అందజేశారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో జరిగిన ఒక కార్యక్రమంలో 20 మంది విద్యార్థులకు, ఇరువురు కోచ్‌లకు వాటర్ స్పోర్ట్స్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పోర్ట్స్ కిట్లను శాప్ సరఫరా చేసిందని, వీటిని సోమవారం విద్యార్థులకు పంపిణీచేయడం జరిగిందని ఆయన తెలిపారు. వాటర్ స్పోర్ట్స్ సీజన్ దగ్గర పడుతున్నందున ఈ కిట్లను సరఫరా చెయ్యడం జరిగిందని ఆయన తెలిపారు.

## గీతం అధ్యాపకురాలికి జర్మన్ వర్సిటీ అహ్వానం



విశాఖ సిటీః గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ గాంధియన్ స్టడీస్ సెంటర్ తత్వశాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పంకోజినీ ములియాకు జర్మనీలోని రూర్ విశ్వవిద్యాలయం విజిటింగ్ స్కాలర్‌గా అహ్వానం లభించింది. జర్మనీలోని రూర్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ మైత్‌తో సంయుక్త అద్యయనాలలో పాల్గొంటారు.

ఈ సందర్భంగా గీతం ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కె. శివ రామకృష్ణ, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.వి.జి.డి. బాలాజీ, డాక్టర్ నళినీ తదితరులు డాక్టర్ పంకోజినీ ములియాను అభినంధించారు.

# అంగన్వాడీ వర్కర్లకు ఎలక్షన్ డ్యూటీలు లేవు

### . అందువల్ల వారికి పోస్టల్ బ్యాలెట్లు జారీ చేయలేదు జిల్లా వ్యాప్తంగా 55 వేల 619 పోస్టల్ బ్యాలెట్లు జారీ చేశాం

### జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి కె.భాస్కర్



విశాఖపట్నం : అంగన్ వాడీ వర్కర్లకు ఎలక్షన్ డ్యూటీలు అప్పగించని కారణంగా వారికి పోస్టల్ బ్యాలెట్లు జారీ చేయలేదని కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి కె.భాస్కర్ స్పష్టంచేశారు. ఈ నెల 11 న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఇ.వి.ఎం.ల ద్వారానే వారంతా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారన్నారు. సోమవారం తమను కలవడానికి వచ్చిన వై.ఎస్.ఆర్.సి.పి. ప్రతినిధులతో ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల సందర్భంగా జారీ చేసిన పోస్టల్ బ్యాలెట్ల వివరాలను తెలిపారు. ఎన్నికల విధులు అప్పగించిన పి.ఓ.లు, ఏ.పి.ఓ.లు, ఓ.పి.ఓ.లకు మార్చి మాసంలో మూడు విడతల్లో శిక్షణా కార్యక్రమాలను నిర్వహించామన్నారు. శిక్షణా కార్యక్రమానికి హాజరైన ఎన్నికల సిబ్బంది అందరికీ పోస్టల్ బ్యాలెట్లు అక్కడే అందజేశామన్నారు. అదే విధంగా పోస్టల్ బ్యాలెట్లు, డిక్లరేషన్లు సేకరించేందుకు వంద ఫెసిలిటేషన్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. డిక్లరేషన్లపై అటే స్టేషన్ చేసేందుకు అదే కేంద్రాల్లో గజిటెడ్ అధికారులను కూడా అందుబాటులో ఉంచామన్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 55 వేల 619 పోస్టల్ బ్యాలెట్లను జారీ చేశామని, సంబందిత ఆర్ .ఓ.ల ద్వారా వాటిని పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఎన్నిక విధులకు హాజరయ్యే సిబ్బంది తమ పోస్టల్ బ్యాలెట్ ను, డిక్లరేషన్ ను పోస్టు ద్వారా ఉచితంగా పంపుకొనే అవకాశాన్ని కల్పించామన్నారు. ఇందుకు పోస్టేజీ చార్జీల క్రింద పోస్టు మాస్టర్ జనరల్ కు రూ.19 లక్షలు చెల్లిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఓట్ల లెక్కింపు వచ్చే నెల 23 న తేదీన జరుగుచున్న సందర్భంగా ఆరోజు ఉదయం 8.00 గంటల లోపు అందే పోస్టల్ బ్యాలెట్లను అన్నింటిని పరిగణలోకి తీసుకుంటూ కౌటింగ్ చేస్తామని కలెక్టర్ స్పష్టంచేశారు.

వై.ఎస్.ఆర్.సి. ప్రతినిధులు ఎం.వి.వి.సత్యనారాయణ, మళ్ల విజయప్రసాద్ , ద్రోణంరాజు శ్రీనివాసరావు, గుడివాడ అమర్ నాద్, బి.వెంకటసత్యవతి తదితరులు కలెక్టరును కలసిన వారిలో ఉన్నారు.

స్ట్రాంగ్ రూమ్లు వద్ద గెజిటెడ్ అధికారులైన డి.టి.లనే నియమించాం...

భారత ఎన్నికల సంఘం జారీ చేసిన ఆదేశాలకు అనుగుణంగానే స్ట్రాంగ్ రూమ్లు వద్ద గెజిటెడ్ అధికారులైన డిప్యూటీ తాసీల్దారులనే భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షించేందుకు పోలీస్ అధికారులతో పాటు నియమించడం జరిగిందని కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి స్పష్టంచేశారు. షిఫ్టుల వారీగా రౌండ్ ది క్లాక్ డి.టి.లుపనిచేసే విధంగా నియమించడం జరిగిందన్నారు.

## మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు

భీమునిపట్నం : తగరపువలస రాము హార్డ్ వేర్ అధినేత బొర్రా రామ్ కుమార్,సూర్యకుమారి దంపతులు తమ స్వంత ఖర్చులతో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వుయ్ కేర్ యు సంస్థ ఇన్ ఛార్జ్ వెంపాడ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఎవరైనా పేదల కోసం ఎటువంటి సహాయం చేసినా వారికి సేవ చేయడానికి ముందు ఉంటామని అన్నారు. వుయ్ కేర్ యు సంస్థ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ వంతు సహాయం చేసారు. ఎండలో బస్సులలో, ఆటోలలో,నడిచి వెళ్ళిన వారికి మజ్జిగ ను పంపిణీ చేశారు. ఈవిధంగా తమ సహాయం ఎవరికైనా చేస్తామనీ ఇలాంటి అవకాశాలు వినియోగించుకోవాలని తెలిపారు. ఎవరికైనా ఇలాంటి సహాయం కావాలంటే 8500264289 నంబర్ కాల్ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వుయ్ కేర్ యు సంస్థ సభ్యులు రాంబాబు, దేవ,సుశీల్ రావు,మేరి,అవినాష్, సూరి,భాను జ్యోతి కలెక్షన్ స్టాప్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ కనుసన్నల్లో ఎన్నికల కమిషన్ నడుస్తోంది

### సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి

నర్సీపట్నం : ఎన్నికల కమిషన్ కేంద్ర ప్రభుత్వ కనుసన్నల్లో నడుస్తుందని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్య నారాయణమూర్తి ఆరోపించారు. సోమవారం విశాఖజిల్లా నర్సీపట్నం కృష్ణాపేలస్‌లో విలేకర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సుప్రీంకోర్టు కలగజేసుకుంటే తప్ప ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవడానికి ఎన్నికల కమిషన్ ఉపక్రమించలేదన్నారు. ఎన్నికల నియమావళి ఎక్కువగా కేంద్రంలో అధికార పార్టీ ఉల్లంఘించిందన్నారు. దీనికి ఎన్నికల కమిషన్ పూర్తి బాధ్యత వహించాలన్నారు.

# ఉద్యోగస్తులకు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకునే అవకాశం ఇవ్వాలి

## వైకాపా పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ విజయ ప్రసాద్ మళ్ల డిమాండ్



విశాఖ సిటీ : ప్రభుత్వ ఉద్యోగులకు ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం ఇవ్వాలని వైకాపా పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ విజయ ప్రసాద్ మళ్ళ డిమాండ్ చేశారు. సోమవారం ఉదయం ఈ మేరకు జిల్లా కలెక్టర్ ను కలసి వినతి పత్రం అందజేశారు.

ఈ సందర్భంగా విజయ ప్రసాద్ మళ్ళ మీడియాతో మాట్లాడుతూ సుమారు 3100 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఇంకా తమ ఓటును వినియోగించుకోలేదని చెప్పారు. ఇందుకు కారణం ఉద్యోగస్తులకు సరిగా ఫారం నింపడం రాకపోవడం, తప్పులుగా నింపడం వలన సమస్య తలెత్తిందని కలెక్టర్ చెప్పడం జరిగిందన్నారు. ఓటు వినియోగించుకునేందుకు ఇంకా సమయం కూడా ఉంది కదా అన్నట్లు కలెక్టర్ చెప్పడం సరికాదన్నారు. ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నట్లు తమకు అనుమానం కలుగుతుందని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు వారి ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకునే అవకాశాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. వైకాపా జిల్లా అధ్యక్షులు గుడివాడ అమర్ నాద్ మాట్లాడుతూ కలెక్టర్ చెప్పే మాటలకు వాస్తవ పరిస్థితులకు చాలా వ్యత్యాసం ఉందన్నారు.

3,100 మంది ఉద్యోగులు ఇంకా తమ ఓటు హక్కును వినియోగించుకోలేదని కలెక్టర్ ఇది వరకు చెప్పడం జరిగిందన్నారు. ఉద్యోగులు అందరూ వైకాపా ఓటు వేస్తారా? లేదా మరే పార్టీకి ఓటు వేస్తారా? అనే వారి ఇష్టమని చెప్పారు. వారు ఓటు వేసే హక్కును వినియోగించుకునే అవకాశాన్ని ఇవ్వాలని తాము కలెక్టర్ కు చెప్పడం జరిగిందన్నారు. దీని పై పలుసార్లు కలెక్టర్ ని కలిసినప్పుడు వేర్వేరు కారణాలు చెప్పడం జరిగిందన్నారు. ఇప్పుడు కూడా ఆయన మాటలు తెలుగుదేశం పార్టీకి అనుకూలంగా ఉన్నాయని ఆరోపించారు. వైకాపా దక్షిణ ఎమ్మెల్యే అభ్యర్థి ద్రోణంరాజు శ్రీనివాసరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మైండ్ గేమ్ ఆడుతూ వైకాపా శ్రేణులను బలహీనపరిచే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. విజయం ఎవరిది అనేది ముందుగానే బ్యాలెట్ బాక్స్ లో నిక్షిప్తమైందని అన్నారు.

సీఎస్ ఎల్.వి.సుబ్రహ్మణ్యం పై తెదేపా నేతలు చేస్తున్న ఆరోపణలు సరి కాదని అన్నారు. ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ఓటును వినియోగించుకునే అవకాశాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు .

ఈ కార్యక్రమంలో విశాఖపట్నం పార్లమెంట్ అభ్యర్థి ఎంవివి సత్యనారాయణ, అనకాపల్లి పార్లమెంట్ అభ్యర్థి సత్యవతి, అసెంబ్లీ అభ్యర్థులు మళ్ల విజయప్రసాద్, ద్రోణంరాజు శ్రీనివాస్ , గుడివాడ అమర్ నాథ్, శెట్టి ఫల్గుణ తదితరులు పాల్గొన్నారు.

# చోడవరంలో భారీ అగ్ని ప్రమాదం ...

- సుమారు 80 లక్షల రూపాయిలు ఆస్తి నష్టం
- నిరాశ్రయులైన 40 కుటుంబాలు ...
- సంఘటనా స్థలాన్ని సందర్శించిన జె.సి. సృజన



చోడవరం : విశాఖ జిల్లా చోడవరం పట్టణంలో ద్వారకానగర్‌లో సోమవారం ఉదయం సంభవించిన భారీ అగ్ని ప్రమాదంలో సుమారు 80 లక్షల రూపాయిల వరకు ఆస్తి నష్టం సంభవించగా, 60 ఇళ్లు కాలిపోయినట్లు బాధితులు చెబుతున్నారు. వీరిలో సుమారు 40 కుటుంబాలు పూర్తిగా నిరాశ్రయులవ్వగా, 250 మంది రోడ్డున పడ్డారని అధికారులు చెబుతున్నారు. దీనిపై చోడవరం అగ్నిమాపక అధికారి జి.వల్లయ్య అందజేసిన సమాచారం మేరకు సోమవారం నమ్మి తాతారావు ఇంట్లో సంభవించిన ఓ చిన్న అగ్నికీలలు ఎగిసిపడి పెనుప్రమాదానికి దారితీసిందన్నారు. అలాగే కోన గంగమ్మ ఇంట్లో గల వంట గ్యాస్ సిలెండర్ పేలడంతో విస్ఫోటనం భారీ స్థాయికు చేరుకుని, మొత్తం 6 వంట గ్యాస్ సిలెండర్లు పేలిపోయినట్లు స్థానికులు, అగ్నిమాపక సిబ్బంది చెబుతున్నారు. అలాగే సుమారు 16 మేకలు, 10 గొర్రెలు పూర్తిగా కాలి, గుర్తు పట్టడానికి వీలు లేకుండా ధ్వంసమయ్యాయని బాధితులు చెబుతున్నారు. దీనిపై తక్షణం స్పందించిన జె.సి. సృజన మండల తహాశీల్దార్ రవికుమార్ సిబ్బందితో ప్రమాదస్థలాన్ని సందర్శించారు. ప్రమాద నష్టం అంచనా వేయవలసిందిగా రెవిన్యూ అధికారులను జె.సి.ఆదేశించారు. అయితే చోడవరం అగ్నిమాపక శకటం ఒకటే రావడంతో పెద్ద ప్రమాదాన్ని సమయానుకూలంగా నిరోధించలేకపోయినట్లు బాధితులు, స్థానికులు ఆరోపిస్తున్నారు.






# గాజులవీధీ ప్రజల దహార్తిని తీర్చండి



విశాఖపట్నం : 27వ వార్డు గాజులవీధీలో 400మంది ప్రజలు త్రాగునీరు లేక నానాఇబ్బందులు పడుతున్నారు. గతంలో జివిఎంసి వారు గాజులవీధీ జంక్షన్‌లో నీళ్ళ ట్యాంకు నిర్మించి అందరికీ నీళ్ళు అందేలా చూసేవారు. ఈ మధ్యకాలంలో ట్యాంకు దిమ్మ, ట్యాంకు తొలగించి అక్కడ సులాభ్ కాంప్లెక్స్ మెయింట్‌నెన్స్ చేస్తున్న కాండ్రేగుల నూకరాజు అనే వ్యక్తి బడ్డీ పెట్టారు. దీని వలన వీధీలో ఉన్న 400మంది ప్రజలు త్రాగునీరు, కాలకృత్యాలకు నీరు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వేసవికాలం కావడంతో చిన్నపిల్లలు, వృద్ధులు దాహార్తిని తట్టుకోలేక బాధలు పడుతున్నారు. వీరు వడగాల్పులకు గురై చనిపోయే ప్రమాదం వుంది. గతంలో జివిఎంసి జోన్-3 కమీషనర్‌గారి ఈ సమస్య పరిష్కరించాలని విన్నవించుకున్నాం. కాని ఇంతవరకు కమీషనర్ చిట్టిబాబుగారు సమస్య పరిష్కరించలేదు. ఇది అన్యాయం.

కావున గతంలో ఉన్న ప్రాంతంలో జివిఎంసివారు నీళ్ళ ట్యాంకు నిర్మించి రోజు నీళ్ళు సరఫరాచేసి ప్రజల దాహార్తిని తీర్చాలని, కంద్రేగుల నూకరాజు పెట్టిన బడ్డీని తొలగించాలని గాజులవీధీ ప్రజలు, సిపిఎం పార్టీ డిమాండ్ చేస్తున్నది. నీళ్ళు లేకపోవడం వలన ప్రజలకు ఎటువంటి నష్టం జరిగినా దీనికి జివిఎంసివారు బాధ్యత వహించాలి.

# ప్రశాంతంగా ముగిసిన నాలుగో విడత పోలింగ్





**మొదటి పేజీ తరువాయి**

సుభాష్ భామ్రే, ఎస్ఎస్ అహ్లువాలియా, బాబుల్ సుప్రియో తదితరులు నాలుగో దశలో పోటీపడ్డారు. మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి కమల్‌నాథ్- ఛింద్‌వాడా శాసనసభ (ఉపఎన్నిక) స్థానానికి, ఆయన తనయుడు నకుల్‌నాథ్.. ఛింద్‌వాడా లోక్‌సభ స్థానానికి కాంగ్రెస్ పార్టీ తరఫున బరిలో ఉండడం విశేషం. నాలుగో విడత పోలింగ్‌తో కలిపి ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 373 లోక్‌సభ నియోజకవర్గాలకు పోలింగ్ పూర్తైంది. ఐదో విడత ఎన్నికలు మే 6న జరగనున్నాయి.

బెంగాల్‌లో ఘర్షణలు..

గత ఎన్నికల మాదిరిగానే నాలుగో విడత పోలింగ్‌లోనూ పశ్చిమబెంగాల్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలింగ్ కేంద్రాల వద్దే తృణమూల్, భాజపా, వామపక్షాల కార్యకర్తలు భద్రతా సిబ్బందితో ఘర్షణకు దిగారు. దీంతో ఆందోళనకారులను అదుపుచేసేందుకు పోలీసులు లాఠీఛార్జ్ చేయాల్సి వచ్చింది. బెంగాల్‌లోని ఆసన్‌సోల్ నియోజకవర్గ పరిధిలోని ఓ పోలింగ్ కేంద్రం వద్ద కేంద్రమంత్రి బాబుల్ సుప్రియో కారుపై కొందరు వ్యక్తులు దాడి చేశారు. మరికొన్ని చోట్ల తృణమూల్, భాజపా కార్యకర్తల మధ్య ఘర్షణ జరిగి పలువురు గాయపడ్డారు.

ఓటేసిన ప్రముఖులు..

దేశ వాణిజ్య రాజధాని ముంబయిలోనూ ఈ విడతలోనే ఎన్నికలు జరిగాయి. దీంతో రాజకీయ, సినీ, క్రీడా, వ్యాపార రంగానికి చెందిన పలువురు ప్రముఖులు నేడు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ప్రముఖ నటులు వివేక్ ఓబెరాయ్, షారూక్‌ఖాన్, గౌరీఖాన్, అమితాబ్ బచ్చన్, అభిషేక్ బచ్చన్, జయా బచ్చన్, ఐశ్వర్యరాయ్, మాజీ క్రికెటర్ సచిన్ తెందూల్కర్ కుటుంబసభ్యులు ఓటు వేశారు.





# ప్రభుత్వ భూములను పరిరక్షించాలని వినతి




గాజువాక:జివిఎంసి 61వ వార్డు పరిధి సనత్ నగర్ లోని ప్రభుత్వ భూములను పరిరక్షించి గ్రామాభివృద్ధికి వినియోగించేలా చర్యలు చేపట్టాలని సనత్ నగర్ గ్రామస్తులు కోరారు.ఈ మేరకు సోమవారన్ జోన్-5 కార్యాలయంలో జరిగిన గ్రేవెన్స్ లో కమీషనర్ శ్రీధర్ కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ సర్వే నంబర్ 185 లో సామాజిక భవనం నిర్మాణానికై కేటాయించిన స్థలాన్ని ఓ టిడిపి నాయకుడి అనుచరులు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని అయితే సుమారు 15ఏళ్లుగా అనేక విధాలుగా చేసిన ప్రయత్నాలకు ఫలితంగా ఆరునెలల క్రితం సామాజిక భవన నిర్మాణానికి నిధులు మంజూరు అయినప్పటికీ కబ్జాకోరుల లాబీయింగ్ కారణంగా పనులు ప్రారంభం ఆలస్యమయ్యిందని అయితే ఇప్పటికీ కబ్జా ప్రయత్నాలు మాత్రం నిరాటంకంగా సాగుతున్నాయని అందులో భాగంగా ఆదివారం రాత్రి కొందరు వ్యక్తులు నిర్మాణానికి తీసిన గోతులు పూడ్చివేసే ప్రయత్నం చేసారని తెలిపారు.ఇప్పటికే ముగ్గురు శాసనసభ్యులు సహా ముగ్గురు కమిషనర్లు మారినప్పటికీ నిర్మాణం పూర్తి కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి కబ్జాకు యత్నిస్తున్న వారిపై కఠిన చర్యలు చేపట్టి సామాజికభవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని కోరామన్నారు.సమస్యపై సానుకూలంగా స్పందించిన కమీషనర్ తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.వినతిపత్రం ఇచ్చిన వారిలో స్థానికులు గ్రామపెద్దలు పాల్గొన్నారు.

# ఆకట్టుకున్న కేవీ విద్యార్థుల నృత్యరూపకం







విశాఖ సిటీ : స్థానిక తాటిచెట్లపాలెంనందు గల కేంద్రీయ విద్యాలయం, వాల్తేరునందు 39వ వార్షికోత్సవంలో భాగంగా సోమవారం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలలో కేవీ విద్యార్థులైన తన్మయి, రిషిక మరియు తదితర విద్యార్థుల బృందం (జై కిసాన్) రైతులపై చేసిన నృత్యరూపకం ఆహూతులను అలరించింది. విద్యార్థినులు బాల్యం నుండి దేశభక్తి కలిగి ప్రజాచైతన్యవంతమైన కార్యక్రమాలు నృత్యరూపకంలో అందరికీ అర్థమయ్యే రూపకంలో ప్రదర్శించడం బహుదా ప్రశంసనీయమని విద్యాలయం ఉపాధ్యాయులు తన్మయి, రిషికలను అభినందించారు.

# జనారణ్యంలోకి 'జింక'

ఖమ్మం : దారితప్పి జనారణ్యంలోకి వచ్చిన ఓ జింక వాహనం ఢీకొని మృత్యువాత పడింది. ఈ సంఘటన ఖమ్మం అర్బన్ పరిధి లోని గోపాలపురంలో ప్రధాన రహదారిపై చోటుచేసుకుంది. ఖమ్మం అర్బన్ పోలీసుల కథనం ప్రకారం... గోపాలపురం వద్ద రోడ్డు పక్కకు పడిపోయి ఉన్న జింకను గుర్తించిన స్థానికులు, ప్రయాణికులు అర్బన్ పోలీసులకు సమాచారమందించారు. సంఘ టనా స్థలానికి చేరుకున్న పోలీసులు విషయాన్ని అటవీ అధి కారులకు తెలియజేశారు. ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్న జింకను వారికి అప్పగించారు. ఫారెస్ట్ అధికారులు రాపర్తినగర్‌లోని పశు వైద్యశాలకు తరలించగా మార్గమధ్యలోనే చనిపోయినట్లు వైద్యులు నిర్ధా రించారు.

# తాగు నీటి ఎద్దడిలో ఐపీఎల్ అవసరమా!?.

- నీటి ఎద్దడితో విలవిలలాడుతున్న పీఎం పాలెం, మధురవాడ ప్రజానీకం
- ఇప్పటికే ఎడారిలా మారిన చెరువులు, రిజర్వాయర్లు
- ఐపీఎల్ నిర్వహణకు 20 ట్యాంకర్ల నీరు అవసరమా!?
- పూర్తిగా ఎండిన గంభీరం, మురసరలోవ రిజర్వాయరు



మధురవాడ : విశాఖలో ఐపీఎల్ సందడి చేయనున్నది అన్నది అందరికీ తెలిసిన విషయమే మే నెలలో 8 మరియు 10 వ తారీకుల్లో ఐపీఎల్ ప్లే ఆఫ్ మ్యాచ్లు జరగనున్నాయి ఈ క్రమంలో క్రీడా అభిమానుల్లో ఒకింత ఆసక్తి ఉన్నా నిర్వహణ మాత్రం కష్టమనే చెప్పాలి. ఇప్పటికే ఎండ తీవ్రత పెరగడం వలన గ్రామాల్లో అడుగంటిన నీటి మట్టాలతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే మరోపక్క ఐపీఎల్ నిర్వహిస్తామంటూ, విశాఖను వేదికగా ఎంచుకోవడం విమర్శలకు దారి తీస్తోంది. షెడ్యూలు ప్రకారం విశాఖలో మ్యాచ్ లు లేనప్పటికీ చెన్నైలో జరగాల్సిన మ్యాచ్‌లకు సాంకేతిక సమస్యలు తలెత్తడంతో ఆ మ్యాచ్‌లను విశాఖకు తరలించడానికి బీసీసీఐ అనుమతిచ్చింది, అందుకు విశాఖ స్టేడియం సిద్ధమే అయినప్పటికీ ప్రస్తుత పరిస్థితుల్లో నీటి ఎద్దడి తీవ్ర స్థాయిలో ఉండడంతో చర్చాంశనీయంగా మారింది, ఇప్పటికే మధురవాడ, పీఎం పాలెం, కొమ్మాది, బక్కన్నపాలెం తదితర ప్రాంతాల్లో బోర్లు సైతం ఎండిపోవడం వలన త్రాగు నీటి కొరకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదిలా ఉండగా మధురవాడలో ఉన్న ఏసీఏ-వీడీసీఏ క్రికెట్ స్టేడియంలో ఉన్న బోర్లు కూడా ఎండి పోయే అవకాశం ఉందన్నది వాస్తవం. ప్రతిరోజు మహిళలు ఖాళీ బిందెలతో రోడ్డెక్కుతున్నారు. ఒక మ్యాచ్ నిర్వహించాలంటే కనీసం పది రోజుల ముందు నుంచి యథేచ్ఛగా గ్రౌండ్ మొత్తం తడపడానికి కనీసం 10 నుంచి 20 ట్యాంకర్ల నీళ్ల అవసరం పడతాయని, ఇప్పుడున్న ఇలాంటి పరిస్థితుల్లో తమకు నీళ్లు ఇవ్వకుండా స్టేడియం వైపు దారి మళ్లించడంతో స్థానిక మహిళలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే కొన్ని కాలనీలో క్యూ లైన్లో ఉంటేనేగాని రోజుకి 5 బిందెల కంటే నీళ్లు ఇవ్వలేని పరిస్థితి . ఇటువంటి దుర్భర స్థితిలో ఈ మ్యాచ్‌లు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులతో కనీసం సంప్రదించకుండా ఐపీఎల్ నిర్వహించడం ఎంతవరకు సమంజసమని ప్రజలు వాపోతున్నారు, ఐపీఎల్ నిర్వహణ వల్ల దేశానికి ఏమో గాని తమకు మాత్రం ఎటువంటి ప్రయోజనం లేదని, స్థానిక ప్రతిభావంతమైన క్రీడాకారులను వెలికి తీయడానికి ఉపయోగపడే ఐపీఎల్ అయినా ఎక్కడో జరగాల్సిన మ్యాచులు ఇక్కడ జరగడం ఏంటని ప్రశ్నిస్తున్నారు ఇప్పటికైనా ప్రజల ఆవేదనని, అవసరాలను ద ృష్టిలో పెట్టుకొని ఐపీఎల్ మ్యాచ్ నిర్వహణలో అధికారులు సరైన నిర్ణయం తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు .



## కేంద్రం చంద్రబాబుపై కక్ష సాధింపు : రాజప్ప



కాకినాడ : కేంద్రం ప్రభుత్వం అధికారులను గుప్పెట్లో పెట్టు కొని చంద్రబాబు ప్రభుత్వంపై కక్ష సాధింపు చర్యలు చేపడుతుందని ఉప ముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు.తూర్పుగోదావరి జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఉపముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో ఎన్నికలు ముగిసిన తరువాత ఎప్పుడు లేనంతగా ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.ఎన్నికలు జరిగిన తరువాత 45 రోజులు గ్యాప్‌లో ప్రభుత్వం ఎటువంటి సమీక్షలు చేయనివ్వకపోవడం తప్పుఅన్నారు.చంద్రబాబు ప్రభుత్వం ప్రజల చేత ఎన్నికైన ప్రభుత్వం అనే విషయం మరిచారా...? అని ప్రశ్నించారు.చీఫ్ సెక్రటరీకి పాలనకు ఏంసంబంధం....ప్రస్తుతం తుఫాన్ వణికిస్తోంది సహాయక చర్యలుపై సమీక్షలు చేయకూడదంటూ ఎలా అడ్డుకుంటారని ప్రశ్నించారు.ఓక వైపు తుఫాన్ వణికిస్తుంది. రైతులు పంట కాపాడుకునేలా ఏం చర్యలు చేపట్టారని అడిగారు.ఎవరెన్ని లెక్కలు వేసిన తెలుగుదేశం పార్టీ మరోసారి అధికారంలోకి ఖాయంమని జోస్యం చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు నామం రాంబాబు, ఎమ్మెల్సీచిక్కల రామచంద్రరావు,గంగ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# చందనోత్సవ వేడుకలకు పటిష్టమైన ఏర్పాట్లు

## - జిల్లా కలెక్టర్ కె.భాస్కర్



విశాఖపట్నం : వచ్చే నెల 7 న జరుగనున్న శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి వారి చందనోత్సవ వేడుకలకు పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కె.భాస్కర్ తెలిపారు. చందనోత్సవ వేడుకలకు సింహగిరిపై చేస్తున్న ఏర్పాట్లను సోమవారం ఆయన పరిశీలించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగ కుండా స్వామి వారి శీఘ్ర దర్శనం అయ్యేందుకు నిర్మిస్తున్న క్యూలైన్లు ఏర్పాటు చేసే విదానాన్ని, అత్యవసర సమయాల్లో భక్తులు వెంటనే బయటకి వచ్చేందుకు ఏర్పాటు చేస్తున్న అత్యవసర ద్వారాలను పరిశీలించారు. చలువ పందిళ్ల నిర్మాణానికి, త్రాగునీరు, మజ్జిగ నిరంత పంపిణీకి, తాత్కాలిక టాయిలెట్ల ఏర్పాటుకు, పారిశుద్య మెరుగుకు తీసుకుంటున్న చర్యలను పరిశీలించారు. ఈ సారి చందనోత్సవ వేడుకలపై ఫొని తుఫాను ప్రభావం పడనున్న నేపథ్యంలో చలువ పందిళ్లను పటిష్టంగా నిర్మించాలని, అదనంగా పందిళ్ల నిర్మాణ సామాగ్రిని సిద్దంగా ఉంచుకోవాలని అధికారులను ఆదేశించారు.

అనంతరం కలెక్టర్ పాత్రికేయులతో మాట్లాడుతూ ఈ చందనోత్సవ వేడుకల్లో సాధారణ భక్తులకు పెద్ద పీఠవేస్తున్నట్లు తెలిపారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని సాధారణ భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగ కుండా మెరుగైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. గతంలో కంటే ప్రస్తుతం అన్ని క్యూ లైన్ల పొడవులను పెంచతూ భక్తులు ఎటువంటి అసౌకర్యం లేకుండా స్వామివారిని సత్వరమే దర్శించుకొనేందుకు ఏర్పాట్లుచేస్తున్నట్లు తెలిపారు. భక్తులు ఎండబారిన పడకుండా పెద్ద ఎత్తున చలువ పందిళ్లను, ఎండకు భక్తుల కాళ్లు కాలిపోకుండా ఉండేందుకు కార్పెట్లును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వి.వి.ఐ.పి.లు, వి.ఐ.పి.ల వల్ల సాధారణ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఉండేందుకు వారికి ప్రత్యేక దర్శన సమయాలను కేటాయించామన్నారు. వి.ఐ.పి.లు నిర్ణీత సమయాల్లో స్వామివారిని దర్శించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. దివ్యాంగులకు కూడా సాయంత్రం 4.00 గంటల నుండి 5.00 గంటల మద్యప్రత్యేక దర్శన సమయం కేటాయించామన్నారు. వారితో పాటు ఒక సహాయకుని కూడా అనమతిస్తున్నట్లు ఆయన తెలిపారు. పలు రకాల కేటగిరీల్లో భక్తులకు అనువుగా రూ.200/-, రూ.500/-, రూ.1000/- ల టికెట్ల విక్రయాలకు ఏర్పాటుచేస్తున్నామన్నారు. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులను కొండ పైకి తీసుకువెళ్లేందుకు, మళ్లీ క్రిందకు దింపేందుకు ఉచితంగా బస్సులను ఏర్పాటుచేస్తన్నామన్నారు. వి.వి.ఐ.పి., వి.ఐ.పి.లకు చెందిన సొంత వాహనాలను మాత్రమే కొండ పైకి అనుమతిస్తున్నామన్నారు. కొండపై వీటికి ప్రత్యేకంగా పార్కింగ్ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

## భారత్‌పై మరోసారి నోరు పారేసుకున్న ట్రంప్

వాషింగన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై మరోసారి నోరు పారేసుకున్నారు. అమెరికా ఉత్పత్తులపై భారత్ అధిక పన్నులు వేస్తోందన్నారు. పన్నులు వేయడంలో భారత్ మొదటి స్థానంలో ఉందంటూ వ్యాఖ్యానించారు. భారత్, చైనా, జపాన్ లాంటి దేశాలు అధిక పన్నులు వేయడం వల్ల అమెరికాకు లక్షల డాలర్ల నష్టం వస్తోందని ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఖరి మార్చుకోకపోతే.. భారతదేశం నుంచి అమెరికాకు దిగుమతి అవుతున్న ఉత్పత్తులపై తాము కూడా పన్నులు వేస్తామని హెచ్చరించారు.






# మత్స్య నిషేధాజ్ఞలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు

- కోస్టల్ సెక్యూరిటీపై అవగాహన కలిగి ఉండాలి
- ఫణి తుపాను దృష్ట్యా అప్రమత్తంగా ఉండండి
- మత్స్యకారులకు అవగాహన కల్పిస్తున్న మెరైన్ సిఐ బండారు రమణమూర్తి



భీమునిపట్నం : భీమిలి సముద్రతీరం ల్యాండింగ్ పోయింట్ వద్ద మత్స్యకారులతో కోస్టల్ సెక్యూరిటీ సిబ్బంది, జాయింట్ కమిటీ తీర ప్రాంతంలో ఉన్న మత్స్యకారులు వివిధ అంశాలపై అవగాహన కలిగి ఉండాలని సమావేశం సోమవారం నిర్వ హించారు. ఈ సమావేశం లో మెరైన్ అధికారులు సిఐ బండారు రమణ మూర్తి, ఎస్ఐ రమేష్ మరియు ఎఫ్.డి.ఓ శ్రీనివాసు లు మత్స్యకారులతో మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశాల మేరకు 61 రోజుల పాటు మత్స్య నిషేదాజ్ఞలు ఉన్నందువలన ఎవరూ వేటకు వెళ్లకూడదని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించి సముద్రంలో చేపల వేట చేసే మరపడవలు ,యాంత్రిక పడవలను గుర్తించేందుకు మెరైన్ పోలీసులు సహాయంతో సముద్రం లో ముమ్మరం గా తనిఖీలు చేస్తున్నామని వారు తెలిపారు. ఎవరైనా నిబందనలను అతిక్రమించినట్టు తెలిస్తే పట్టుబడిన మర పడవల యజమానికి 2,500 రూపాయలు జరిమానా విదిస్తామని, వారు పట్టిన మత్స్య సంపదను జప్తుచేసి బహిరంగ వేలం వేసి ఈ సొమ్మును ప్రభుత్వానికి జమచేస్తారని అయా పడవల యజమానులకు ఏడాది కాలం పాటు ప్రభుత్వ పథకాలు నిలిపివేయాలని సిఫార్సు చేస్తామని హెచ్చరించారు. అలాగే ఫణి తుపాను దృష్ట్యా ఈ రెండు రోజులు పడవలకు లంగర్ లు వేసి వాటిని సురక్షిత ప్రాంతాలలో వుంచాలని తెలిపారు.

తీర ప్రాంతంలో అనుమానాస్పదంగా ఎవరైనా సంచరించినా, ఈ ప్రాంతానికి సంబంధంలేని పడవలను గుర్తించినా కోస్టల్ సిబ్బందికి సమాచారమందించాలని అన్నారు. తీర ప్రాంతంలో ఎప్పటికప్పుడు సమాచారాన్ని స్థానిక మెరైన్ సిబ్బందికి తెలియజేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మెరైన్ సిబ్బంది పాల్గొన్నారు.

## మోదీ వ్యాఖ్యల్ని తీవ్రంగా ఖండించిన చంద్రబాబు

అమరావతి: పశ్చిమ బెంగాల్‌లో ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలను సీఎం చంద్రబాబు తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా మోదీ వ్యవహరిస్తున్నారంటూ ట్విటర్ వేదికగా మండిపడ్డారు. తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన 40 మంది ఎమ్మెల్యేలు తనతో టచ్‌లో ఉన్నారంటూ మోదీ చేసిన వ్యాఖ్యలు దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. ఎన్నికలు జరుగుతున్న సమయంలో ఇలాంటి వ్యాఖ్యలు చేయడం కోడ్ ఉల్లంఘనేనని, మోదీ చేసిన వ్యాఖ్యలను ఎన్నికల సంఘం సుమోటోగా స్వీకరించి చర్యలు తీసుకోవాలని కోరారు. దేశంలోని అన్ని వ్యవస్థలనూ మోదీ నాశనం చేశారని, తాజాగా ప్రజాస్వామ్యాన్నీ నాశనం చేసేందుకు సిద్ధమయ్యారని విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని నాశనం చేసేందుకే ఆయన ఈ వ్యాఖ్యలు చేశారన్నారు.






# తూర్పు గోదావరి జిల్లాలో విషాదం

తూ.గో: జిల్లాలోని తుని ఉప్పారగూడెం దగ్గర విషాదం నెలకొంది. తాండవ నదిలో మట్టిపెళ్లలు విరిగిపడి ఇద్దరు మృతి చెందగా.. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు.

దీంతో స్థానికులు వారిని సమీప ఆస్పత్రికి తరలించారు. సమాచారం.

అందుకున్న పోలీసులు సంఘటనా ప్రదేశానికి చేరుకుని మృత దేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com